సమావేశము - VI
వాల్యూము - III
సెం. 2

వెల : రూ. 13-00
30 డిసెంబర్, 2016
శుక్రవారం,
(శక సం. 1938,
పుష్య - 1)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| I. | ప్రశ్నోత్తరాలు | ... | 1 |
| II. | సభా కార్యక్రమం : | ... | 14 |
| | 1. ప్రత్యేక ప్రస్తావనలు | | |
| | 2. వాయిదా తీర్మాన తిరస్కరణ | | |
| III. | సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు | ... | 16 |
| IV. | లఘు చర్చ : | ... | 16 |
| | మత్స్య పరిశ్రమ అభివృద్ధి గురించి. | | |

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (ఆరవ సమావేశము - పన్నెండవ రోజు)

## శుక్రవారం, డిసెంబర్ 30, 2016

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ ఛైర్మన్: సభకి నమస్కారం. ఇప్పుడు క్వశ్చన్ అవర్. క్వశ్చన్ నెం. 1394..

### I. ప్రశ్నోత్తరాలు

### సరోజినిదేవి కంటి ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్సల వైఫల్యం

ప్రశ్న నెం.1394(111)

సర్వశ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్, ఎం. రంగారెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి, పాతూరి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) హైదరాబాద్, సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో 2016 జూలై, 7వ తేదీన జరిగిన కంటి సర్జరీలు విఫలమైనందున దాదాపు ఏడుగురు వ్యక్తులు తమ కంటి చూపును కోల్పోయిన మరియు అనేక మంది చికిత్స పొందుతున్న విషయం వాస్తవమేనా;

(ఆ) అయితే, దానికి గల కారణాలేమిటి;

(ఇ) సంబంధిత డాక్టర్లపై తీసుకున్న చర్య ఏమిటి పేద రోగులకు అందించిన సహాయం ఏమిటి?

గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి (డా. సి.లక్ష్మారెడ్డి):- (అ) లేదండీ. 8 మంది రోగులు శస్త్ర చికిత్స చేసిన కన్నులో వారి కంటిచూపును కోల్పోయారు. మరో కన్నులో కంటి చూపు సాధారణంగా ఉన్నందున వారు కంటిచూపును పూర్తిగా కోల్పోలేదు.

(ఆ) సర్జరీ సమయంలో వినియోగించిన కలుషిత రింగర్ లాక్టేట్ సొల్యూషన్ వల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చింది. ఈ సొల్యూషన్‌లో క్లెబ్సిఎల్లా బాక్టీరియా పాజిటివ్ కల్చర్ వుంది.

(i) 1940, ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టంలోని 27(డి) విభాగం క్రింద శిక్ష విధించదగు 18(ఎ)(1) విభాగం, 18(ఎ)(vi) విభాగాల ఉల్లంఘన నిమిత్తం నాగ్‌పూర్, ఎంఐడిసి, ప్లాట్ నెం. ఎఫ్-9/15లోని మెసర్స్ హసీబ్ ఫార్మాస్యూటికల్స్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగు డైరెక్టరు శ్రీ యూసుఫ్ బాదర్‌పై 23-8-2016 తేదీన ఫిర్యాదు నమోదయింది, 24-8-2016 తేదీన పి.ఐ.నెం. 167/2016, ఎస్ఆర్.నెం.2975/2016 ద్వారా నాంపల్లి 6వ అదనపు ్ఛీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదును దాఖలు చేయడమయింది. ట్రయల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది.

(ii) తదుపరి సంక్లిష్టతలను నివారించడానికి సముచిత నిపుణుల సంరక్షణను ఇవ్వడం జరిగింది.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : (శాసన సభ నియోజక వర్గం) అధ్యక్షా, జూలై 7, 2016న సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో జరిగిన సంఘటనలో గౌరవ మంత్రివర్యులు చెప్పినట్లు దిగ్భ్రాంతికి లోనైన సంగతి అందరికీ తెలిసిందే. గౌరవ మంత్రివర్యులు ఈ అంశంపై గంభీరంగా ఆలోచించి ఇంకా ఎవరూ కూడా ఇలాంటి సాహసం చేయకుండా సెలైన్ సప్లైలో గానీ, ఈ ఆర్ఎల్ సొల్యూషన్స్ కలుషితమైన మందులు ఇవ్వకుండా చట్టాలు చేయాలి. ఇప్పుడు గౌరవ మంత్రివర్యులు చదివినట్లు ఇది 1940వ చట్టం బ్రిటీష్ కాలంలో నాటి చట్టాలు ఇవి. నిన్న గౌరవ సాగునీటి శాఖమంత్రి గారు 2013 భూసేకరణ చట్టం తెచ్చామని అన్నారు. ఇలాంటి చట్టాలు రావాలి అధ్యక్షా. ఇంకా పదునైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. మెసర్స్ హసీబ్ ఫార్మాస్యూటికల్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ బ్లాక్ లిస్టులో ఉంది. ఈ ఆర్ఎల్ సొల్యూషన్స్ వారు ఇక్కడే కాకుండా ఇంకా ఎక్కడైనా కలుషితమైన మందులు సరఫరా చేశారా? దీనిమీద

చర్యలు చేపట్టడానికి కేసు కోర్టులో పెండింగ్ ఉందని మంత్రివర్యులు అంటున్నారు. కానీ, ఇది చాలా సీరియస్ అంశం.

ఎందుకంటే, ప్రో ప్యానెల్ రిపోర్టు, ప్రభుత్వం ఇప్పటికే హుమయూన్ నగర్ పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్ చేసిన కేసు సెక్షన్ 338ఐపిసి క్రింద causing grievous hurt and endangering the life and personal safety అనేది వచ్చింది. As if ఇది ప్రాణాలకి ముప్పు ఉన్నటువంటిది. దీనివల్ల కళ్లు కోల్పోయిన అనేకమంది పేర్లు కూడా ఉన్నాయి. భువనగిరి, శ్రీకాకుళం నుండి ఇంకా తదితర ప్రాంతాలనుండి వచ్చినవారున్నారు.

ఇందులో 13మందికి ఎఫెక్ట్ అయింది, ఐదుగురికి సివియర్‌గా ఉంది. వారి పరిస్థితి ఏమిటి? ఈ ఎఫెక్టెడ్ కుటుంబాలకి ప్రభుత్వ పరంగా సహాయం ఏమి అందిస్తున్నారు. వారంతా పాపం అమాయకంగా ట్రీట్‌మెంట్ కొరకు వచ్చారు. ఇందులో వారి పాత్ర ఏమిలేదు. డాక్టర్లు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. డాక్టర్ల నిర్లక్ష్యమా? లేదా సప్లై చేసినటువంటి మెసర్స్ హసీబ్ ఫార్మాస్యూటికల్స్ ప్రయివేటు లిమిటెడ్ వారి నిర్లక్ష్యమా? ఈ మెసర్స్ హసీబ్ ఫార్మాస్యూటికల్స్ ప్రయివేటు లిమిటెడ్ వారు సప్లై చేసిన మందులో బ్యాక్టీరియా ఉండడం వల్ల ఎఫెక్ట్ అయిందని చెబుతున్నారు. ఈ సప్లై చేసిన దాంట్లో కూడా క్లెప్సిల్లా బ్యాక్టీరియా ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం ఒక కనువిప్పుగా తీసుకోవాలి. ఇటువంటి కలుషితమైన మందులు ఇతర ఆసుపత్రులకు కూడా సరఫరా చేస్తుండవచ్చు.

కాబట్టి వీటిపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? రోజా వారీ నిఘా ఏమిటి? వీటన్నింటిపై ఆరోగ్య శాఖ ఏ రకంగా చర్యలు చేపడుతుందనేది ముఖ్యం. ఎందుకంటే ఇలాంటి సంఘటనలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అనేకం జరుగుతున్నాయి. పేదల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. పేదల ప్రాణాలతో ఆడుకునే వారిమీద చర్యలు చేపట్టడానికి ఒక చట్టం రావాలి. కాబట్టి, నా విజ్ఞప్తి ఏమిటంటే, దీనిమీద ఒక హౌస్ కమిటీ వేసి లేదా సమగ్ర దర్యాప్తు కొరకు విజిలెన్స్ కమిటీ వేస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి :(ఉపాధ్యాయ నియోజక వర్గం - మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్) అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు సమాధానంలోనే స్పష్టంగా చెప్పారు. 8మంది రోగులకు ఒక కంటికి శస్త్ర చికిత్స చేయగా వారు ఆ శస్త్ర చికిత్స చేసిన కన్నులో వారి కంటిచూపును కోల్పోయారు. మరో కంటి చూపు సాధారణంగా ఉన్నందున వారు కంటిచూపును పూర్తిగా కోల్పోలేదని చెప్పడం జరిగింది. ఈ సంఘటన సరోజిని దేవి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సరిగ్గా న్యాయం జరుగుతుందనే ఆలోచనలో ఉంటారు అందరు. నాకు తెలిసిన సమాచారం ప్రకారం, మంచి క్వాలిఫైడ్ డాక్టర్లు ఉంటారు. పని చేసిన వరకు మాత్రం బాగా చేస్తారు అనేటువంటి దృక్పథంతోనే రోగులందరు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారు. ఒక కంటిచూపు పోయిందన్నట్లుగా గౌరవ మంత్రివర్యులే అంగీకరిస్తున్నారు. సంబంధిత డాక్టర్లపై తీసుకున్న చర్య ఏమిటని అడిగితే నాంపల్లి 6వ అదనపు ఛీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదును దాఖలు చేయడమయింది, ట్రయల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది అన్నారు. అంటే ఏమన్నట్లు అధ్యక్షా. డాక్టర్లమీద చర్య తీసుకుంటేనే అందరికీ కూడా నమ్మకం కలుగుతుంది. కాబట్టి చర్యలు ఏమి తీసుకున్నారనేది ప్రభుత్వం వైపు స్పష్టంగా ఉండాలి. ఈ విషయం మాత్రం ఉపేక్షించదగిన అంశం కాదు. ఒక కంటిచూపు పోయిన తరువాత కూడా సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకుంటలేమంటే ఇది సరియైన నిర్ణయం కాదు. కాబట్టి ప్రభుత్వం డాక్టర్లమీద ఎటువంటి నిర్ణయం తీసుకుంటున్నారనే విషయం స్పష్టంగా తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

డా. సి. లక్ష్మారెడ్డి : అధ్యక్షా, ఈ సంఘటన జరగడం చాలా దురదృష్టకరం. కానీ, సభ్యులందరికీ మరియు సమాజానికి కూడా తెలియాల్సింది ఏమిటంటే, సరోజిని దేవి కంటి ఆసుపత్రి ఎన్నో ఏండ్లుగా బీద ప్రజలకు సేవలందిస్తున్నది. అందులో సంవత్సరానికి 40 నుండి 50వేల సర్జరీలు అవుతున్నాయి. World Health Organization నార్మ్స్ ప్రకారం 0.07శాతం అంటే, వెయ్యికి ఒకటి, రెండు కేసుల్లో ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఉంటాయి. సరోజిని దేవి ఆసుపత్రిలో ఓవర్‌ఆల్‌గా జరిగిన సర్జరీలను బట్టి చూస్తే కూడా World Health Organization నార్మ్స్ ప్రకారం వచ్చే ఇన్‌ఫెక్షన్ (0.07)శాతం కంటే తక్కువగానే ఉంది. కానీ, ఒకటేసారి ఇంతమందికి జరగడమనేది చాలా దురదృష్టకరం. దానిమీద శాఖాపరంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగింది.

డ్రగ్ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ విషయం గత కొద్దిరోజులుగా లోపభూయిష్టంగా ఉంది. మెసర్స్ హసీబ్ ఫార్మాస్యూటికల్స్ ప్రయివేటు లిమిటెడ్ వారు 2007, 2009, 2013, 2015వ సంవత్సరాల్లో టెండర్‌లో పాల్గొని ఎల్-1 స్థానంలో వస్తున్నారు. ఈ సంఘటన మా దృష్టికి వచ్చిన తరువాత ఈ టెండర్ విధానంలో మార్పు తీసుకురావడం జరిగింది. ఎల్-1 సిస్టంలోనే క్వాలిటీ పెర్‌ఫార్మెన్స్, అనుభవం ఖచ్చితంగా ఉండాలని మార్పు చేయడం జరిగింది. ప్రైవేటు ఆసుపత్రులు ఏవైతే ఫ్లూయిడ్స్ గానీ, మందులు గానీ కొనుగోలు చేస్తున్నారో అవే ఫ్లూయిడ్స్, మందులు ఇప్పుడు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

ఉదాహరణకు చూసుకుంటే, గాంధీ ఆసుపత్రిలో లిఫ్టులు చెడిపోయాయి, లిఫ్టులు పనిచేయడం లేదని మనం చాలాసార్లు మాట్లాడుకోవడం జరిగింది. మేము ఆ లిఫ్టులకు మరమ్మత్తులు చేయించాలని ఆ కంపెనీని వెతికితే ఆ కంపెనీనే లేదు. అంటే అటువంటి సబ్‌స్టాండర్డ్ కంపెనీల నుండి గతంలో కొనుగోలు చేయడం జరిగింది. అందుకే మేము టెండర్ విధానంలోనే సమూలంగా మార్పులు తీసుకురావడం జరిగింది. గతంలో కూడా ఫర్నీచర్ కొనేవారు, అవి నాలుగు రోజుల్లోనే చెడిపోయేవి. కానీ ఇప్పుడు High end quality నే సరఫరా చేయాలనే నార్మ్స్ టెండర్‌లో పెట్టి పరికరాలను కొనుగోలు చేయడం జరుగుతుంది. గతానికి ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూస్తాము.

మెసర్స్ హసీబ్ ఫార్మాస్యూటికల్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీని సీజ్ చేయడం జరిగింది. దానిని బ్లాక్‌లిస్టులో పెట్టడం జరిగింది. భవిష్యత్తులో వారు టెండర్‌లో పాల్గొనకుండా చర్యలు చేపట్టడం జరుగుతుంది. ప్రభుత్వ పరంగా చేపట్టే చర్యలన్నీ చేపట్టడం జరిగింది. బాధ్యులయినటువంటి రోగులు ఎవరైతే ఉన్నారో వారిలో కొంతమంది పూర్తిగా రికవరీ అయ్యారు. వారికి అత్యంత నాణ్యతగల ట్రీట్‌మెంట్ ఏదైతే అందించాలో అది అందించాము. ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి నుండి అత్యంత నిపుణులని తీసుకువచ్చి వారికి ట్రీట్‌మెంట్ అందించడం జరిగింది. ఇంకా కొంతమందికి ట్రీట్‌మెంట్ జరుగుతూనే ఉంది. వారికి పూర్తిగా చూపు పోయిందని చెప్పేందుకు కూడా లేదు. వారికి చూపు వచ్చేటువంటి అవకాశం కూడా ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రులు ఎంతోమందికి సర్వీస్ అందిస్తున్నాయి. మనం వాటిని ఎంకరేజ్ చేయాల్సిన అవసరం ఉంది. నేను ముఖ్యంగా గౌరవ సభ్యులకి, మీడియా వారికి కూడా తెలియజేస్తున్నాను. మన ఆసుపత్రులు బాగా లేవని చెబితే బీద ప్రజలు బెదిరిపోయి బయట ఉన్నటువంటి ప్రైవేటు ఆసుపత్రులకి వెళ్లి వేలకు, వేలు ఖర్చు చేసుకునేటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. ఉదాహరణగా చూసుకుంటే సరోజిని దేవి ఆసుపత్రిలో ఈ సంఘటన జరిగిన పిదప కొద్దిగా అపనమ్మకంతో బీద ప్రజలు ఎక్కువగా ఈ ఆసుపత్రికి రాలేకపోయారు. కానీ, మళ్లీ ఇప్పుడిప్పుడే మూడు, నాలుగు నెలల తరువాత ఈ ఆసుపత్రికి వచ్చే బీద ప్రజలు సంఖ్య పెరుగుతోంది.

కానీ, ఏ అవకతవకలు జరిగినా ఎట్టి పరిస్థితుల్లో ఎవరినైనా ఉపేక్షించేటువంటి పరిస్థితి లేదు. ఎవరిపైనానైనా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అలాగే అన్ని రకాలుగా ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరుస్తున్నామని మీద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, ఆ World Health Organization నార్మ్స్ మాకు తెలియంది కాదు. అవి ఎక్కడో ఒక దగ్గర జరుగుతుంటాయి. గాంధీ ఆసుపత్రిలో లిఫ్టులు ఏమిటి, మౌలిక వసతులు ఏమిటీ అనే వాటిమీద తరువాత చర్చించండి. కానీ, ఇది చాలా సీరియస్ అంశం అధ్యక్షా. ఈ అంశంలో అన్ని విషయాలు బయటకు రావాలంటే, దీనిమీద హౌస్ కమిటీ వేయాలి. ఇది మా డిమాండు. అది చెప్పకుండా, ఇంకేదో చెబితే ఎలా. అసలు డ్రగ్ కంట్రోల్ విషయంలో తెలంగాణలో అడ్మినిస్ట్రేషన్ ఎలా ఉంది. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ మీద ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? డ్రగ్ కంట్రోల్ ఎంత ఎఫెక్టివ్‌గా పని చేస్తుందనేది ముఖ్యం.

సరోజిని దేవి ఆసుపత్రిలో మంచి, మంచి డాక్టర్లు పని చేశారు. కానీ, ఈ సంఘటన సరోజిని దేవి ఆసుపత్రికి మచ్చ తెచ్చిన అంశం ఇది. డబ్ల్యూహెచ్ఓ నార్మ్స్ చెప్పి ఈ అంశాన్ని డైల్యూట్ చేసేటువంటి సమాధానం కాకుండా ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలి. కఠిన చర్యలు తీసుకోవాలి. డాక్టర్లు బాధ్యులా? సరఫరా చేసేవారు బాధ్యులా? టెండర్ విధానంలో పొరపాటు ఉందా? ఈ విషయాలన్నీ చూడాలి. అసలు క్రిమినల్ చర్యలు ఏమి తీసుకున్నారు? కోర్టు పేరుతో పెండింగ్ పెట్టాల్సిన అవసరం లేదు. ఈ అంశంపై హౌస్ కమిటీ వేయాలని, దీనిమీద సమగ్ర దర్యాప్తు జరపాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ :(శాసన సభ నియోజక వర్గం) అధ్యక్షా, ఆరోగ్య శాఖ మంత్రి గారు డాక్టరు గారు కూడా. డాక్టర్ల మీద ఉన్న ప్రేమతో బహుశా అతనికి డాక్టర్లను కాపాడాలనే ఉద్దేశం ఉందో, ఏమో తెలియదు. కానీ, ఈ సమావేశాలు మొదలైనప్పటి నుండి మనం పరిశీలిస్తే దాదాపు ఎక్కువ ప్రశ్నలు ఆరోగ్య శాఖ మీదనే వచ్చాయి. ఈ ప్రశ్నలను గమనిస్తే మెజారిటీ సభ్యుల ఉద్దేశం ఏమున్నదంటే, ఆరోగ్య శాఖ సరిగ్గా పని చేయడం లేదనే ఉద్దేశం ఉంది. ముఖ్యంగా ఆసుపత్రుల విషయానికి వస్తే, గాంధీ ఆసుపత్రి విషయం గానీ, సరోజిని దేవి ఆసుపత్రి విషయం గానీ, ఉస్మానియా ఆసుపత్రి విషయం గానీ, వరంగల్‌లోని ఆసుపత్రి విషయంలో గానీ, నిజామాబాద్ జిల్లా ఆసుపత్రి విషయంలో గానీ, డెలివరీలు ఆసుపత్రి బయటనే కావడం గానీ రోజూ ఏవో కొన్ని వార్తలు వస్తూనే ఉంటాయి ఈ ఆసుపత్రుల పైన. కాబట్టి ఈ అంశంపై హౌస్ కమిటీ వేస్తే, హౌస్ కమిటీ ద్వారా మనకు కొన్ని సలహాలు, సూచనలు వస్తాయి. అందుకని, ఈ అంశంపై హౌస్ కమిటీ వేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.

డా. సి.లక్ష్మారెడ్డిః అధ్యక్షా, సరోజిని దేవి ఆసుపత్రిలో జరిగిన సంఘటన దురదృష్టకరం అని ఒప్పుకుంటూనే ఎవరైతే బాధ్యులని తేలిందో, వారిపై చర్యలు కూడా తీసుకోబడ్డాయి. శాఖాపరంగా కేసులు పెట్టగలుగుతామే తప్ప, అంతకంటే ఎక్కువగా లీగల్‌గా మనం ఏమీ చేయలేము. కేసు కోర్టులో ఉంది కాబట్టి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అన్ని రకాలుగా చర్యలు చేపట్టడం జరుగుతుందని మీద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

10.20 ఉ. శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ : అధ్యక్షా, గ్లోబల్ ఆసుపత్రి డాక్టర్లు నిఖిల్ రెడ్డి అనే అబ్బాయిని ఎత్తు పెరిగేట్లు చేస్తామని అతనికి మోకాళ్ల శస్త్ర చికిత్స చేయడం జరిగింది. ఆ విషయంలో డాక్టర్లు తప్పు చేశారని, అందుకు డాక్టర్లు కొన్ని సంవత్సరాల వరకు ప్రాక్టీస్ చేయకూడదని ఎంసిఐ వారు డాక్టర్లకు తెలియజేయడం జరిగింది.

అలాగే మన రాష్ట్ర ప్రభుత్వం కూడా డాక్టర్లు ఏదైనా పొరపాటు చేస్తే వారికి కూడా శిక్ష విధించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. అప్పుడు మన దగ్గర కూడా డాక్టర్లు పొరపాటు చేయకుండా జాగ్రత్త పడడానికి అవకాశం ఉంటుంది. అందుకే అలాంటి చర్యలు చేపట్టే విధంగా మన ప్రభుత్వం ఏదైనా ఆలోచనలో ఉందా అనేది తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

డా. సి. లక్ష్మారెడ్డి : అధ్యక్షా, గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి సంఘటనలు జరగలేదు. మొదటిసారి Telangana Medical Council ఎనిమిది మంది డాక్టర్ల మీద కేసులు పెట్టడం జరిగింది. అట్లాగే కరీంనగర్‌లో కొన్ని అనవసరమైన సర్జరీలు జరిగాయని కంప్లైంట్స్ వస్తే ఎంక్వైరీ చేయించి వారిమీద కేసులు పెట్టడం జరిగింది. అందులో కొంతమంది ఇప్పటికీ కూడా జైళ్లోనే ఉన్నారు. గతంలో డిపార్టుమెంట్‌ని నెగ్లెక్ట్ చేయడం వల్లనే ఈ పరిస్థితిలు వచ్చాయి. అయినా సరే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక ఒకటెనుక ఒకటి ప్రక్షాళన చేస్తూ వస్తున్నాము.

ఇప్పుడిప్పుడే అన్ని ఆసుపత్రులను మెరుగుపరుస్తున్నాము. ఈమధ్యనే ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరిగింది కాబట్టే, ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ.పి., ఐపి పెరిగింది, కాన్పులు పెరిగాయి. నిఖిల్‌రెడ్డి విషయంలో పొరపాటు చేసిన డాక్టర్ల మీద శాఖాపరమైన చర్యలు చేపట్టాము.

శ్రీ ఈటల రాజేందర్ : అధ్యక్షా, గౌరవ వైద్యశాఖా మాత్యులు చేస్తున్న కృషి, వారి తపన నాకు తెలుసు. వారు ప్రతి నెలా శాఖాపరంగా ఏ, ఏ కార్యక్రమాలు చేస్తున్నారు, వారికి ఎంతెంత నిధులు అవసరమున్నాయనేది మమ్మల్ని అడుగుతానే ఉంటారు.

పేదలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలు అవుతున్న సందర్భంలో రైతుల ఆత్మహత్యలకు కారణం కేవలం పంటలు ఎండిపోవడమే కాదు, ఆపద వచ్చినప్పుడు ప్రైవేటు వైద్యానికి పోయి ఆ క్షణంలో ప్రాణాల్ని బ్రతికించుకొనే ఆరాటంతో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎటూతోచక ఆత్మహత్య చేసుకునేటువంటి పరిస్థితులు మనం చూస్తున్నాము. అనేక పేద కుటుంబాలు విద్యనందించే విషయంలో కూడా అప్పులపాలు అయి ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకుంటున్నారు. కాబట్టి, గ్రామీణ ప్రాంతాలలో ఉండే పేద ప్రజలకి వైద్యపరమైనటువంటి ఇబ్బందులు ఉండవద్దని, వారిపై విద్యాపరమైన భారం కూడా పడొద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది. సర్వరోగ నివారిణి లాగా ప్రైవేటైజేషన్ మాత్రమే అన్నింటికి పరిష్కారం అనే పద్ధతి గతంలో ఉండేది.

ప్రభుత్వ వైద్య విధానం మీద ప్రజల్లో పూర్తి విశ్వాసం కల్పించాలనే సంకల్పంతో ఆ శాఖకి నిధులు కేటాయించడమే కాకుండా ఒక్కొక్క బెడ్‌కి రూ.5,000/-లు కేటాయించి ఆదుకోవాలనే సంకల్పం ఈ ప్రభుత్వంలోనే వచ్చింది. ప్రభుత్వ పరమైన వైద్యం గొప్పగా ఉండాలనే విషయంలో మరియు నిర్లక్ష్యంగా పనిచేసేటువంటి డాక్టర్లు గానీ ఇతరత్రా ఎవరైతే ఉన్నారో వారిమీద చర్య చేపట్టాలనే విషయంలో కూడా ఏకీభవిస్తున్నాము. ఆ చర్యలు చేపట్టడానికి కూడా ప్రభుత్వం వెనుకాడటం లేదు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లో అనేక సంఘటనలు జరుగుతుంటాయి, అవి బయటకు రావు, వారు మేనేజ్ చేసుకుంటారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ట్రీట్‌మెంట్ ఇచ్చి, ఇచ్చి ఇక రోగి బ్రతికే పరిస్థితుల్లో లేరని తెలిస్తే అప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులైన ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకి పంపిస్తారు. అంటే అర్థం ఏమిటి? ఆసుపత్రిలో చనిపోతే మాకు నెగెటివ్ అవుతుందనే ఆలోచనతో ఇటువంటి పనులు చేస్తుంటారు. ఆ నెగెటివ్‌ని అంతా కూడా కడుపులో పెట్టుకొని భరించే సంస్థలు ప్రభుత్వ వైద్యశాలలు. గౌరవ మంత్రివర్యులు స్వయంగా డాక్టరుగా ఉండి ప్రభుత్వ వైద్య విధానాన్ని బాగు చేయాలనే గొప్ప సంకల్పంతో ఉన్నారు. కాబట్టి, తప్పకుండా ప్రతిపక్ష సభ్యుల సూచనలు, సలహాలు తీసుకుంటారు. మంత్రివర్యులు ఓ.పి. పెరిగిందని చెప్పిన దానికి నిదర్శనమే చర్యలు చేపడుతున్నామని అర్థం. అలా ప్రజల్లో విశ్వాసం కలిగింది కాబట్టే ఓ.పి. పెరిగింది. ఎల్‌ఓపి గారు మాట్లాడుతూ, పదే, పదే ఈ శాఖ పైనే ప్రశ్నలు వస్తున్నాయనే ఒక గొప్ప మాట చెప్పారు. వస్తున్నాయి, ఎందుకంటే అంతో ఇంతో విశ్వాసం కలిగింది కాబట్టి వస్తున్నాయి. దీనిని బాగు చేయాలనే తపన ఉంది కాబట్టి వస్తున్నాయి. ప్రతిపక్షాల

ఆలోచనలు పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ ఆసుపత్రులను గొప్పగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తామని, ఆర్థిక శాఖా పరంగా కూడా వైద్య శాఖకి పూర్తిగా సహకారం అందిస్తామని మీద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ : అధ్యక్షా, వైద్య శాఖా మాత్యులు మరియు ఆర్థిక శాఖా మాత్యులు కూడా వివరణ ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని ఆసుపత్రుల నుండి రోగులు ఇబ్బందులు పడుతున్నారని కంప్లైంట్స్ వస్తున్నాయి. కాబట్టి, ప్రభుత్వాసుపత్రులన్ని మెరుగుపరచాలని అంటున్నాము. గౌరవ ముఖ్యమంత్రి గారు వైద్య శాఖ మీద సమీక్ష చేపట్టినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి బాగా లేదని ఆగ్రహించినట్లుగా నేను వార్తా పత్రికల్లో చదవడం జరిగింది. కాబట్టి, వైద్య విధానంపై హౌస్ కమిటీ వేస్తే ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు వస్తాయి, దాంతో ప్రభుత్వ వైద్యశాలలను ఇంకా మెరుగుపరచుకొనేందుకు అవకాశం కలుగుతోందని తెలియజేస్తున్నాను. అలాగే ఈ ప్రభుత్వం ప్రజా వైద్య, ఆరోగ్యం దృష్టిలో విఫలమైందని, ప్రభుత్వం నుండి సరిగా సమాధానం రానందుకు నిరసన తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ వాకౌట్ చేస్తుంది.

(కాంగ్రెస్ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.)

శ్రీ ఈటల రాజేందర్ : అధ్యక్షా, నిజాయితీ లేదు, నీతి లేదు. అసలు వీటన్నింటికీ బాధ్యులు వారే. ఒకటొకటిగా, ఒకటొకటిగా అర్థం చేసుకొని బాగు చేసే ప్రయత్నం చేస్తున్నప్పుడు మీరు సూచనలివ్వండి, సలహాలివ్వండని మేము వాటిని గౌరవిస్తాం, స్వీకరిస్తాం, వాటిని అమలు చేసే ప్రయత్నం చేస్తామని గౌరవ మంత్రివర్యులు, నేను చెప్పినప్పటికీ కూడా వారు వాకౌట్ చేయడంలో ఎంత బాధ్యతారాహిత్యం ఉందో దానినిబట్టి అర్థం అవుతుంది. కేవలం వారికి రాజకీయాలు తప్ప, ప్రజల పట్ల గానీ, ప్రజల సమస్యల పరిష్కారం పట్ల గానీ నిజాయితీ లేదన్నదానికి నిలువెత్తు సాక్షమే కాంగ్రెస్ పార్టీ అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కరీంనగర్ జిల్లా హెడ్ క్వార్టర్లో మొదటిసారిగా ఐసియు యూనిట్ ఏర్పాటు చేయడం జరిగింది. తప్పకుండా రాబోయే కాలంలో పేద ప్రజలకి గొప్ప వైద్యాన్ని అందించి బంగారు తెలంగాణ మార్చడంలో మా పాత్ర ఉంటుందని మనవి చేస్తున్నాను.

(వాకౌట్ చేసిన కాంగ్రెస్ సభ్యులు తిరిగి తమ తమ స్థానాల్లో ఆశీనులయ్యారు.)

## రాష్ట్రంలో కాలానుగుణ వ్యాధులు

ప్రశ్న నెం.1484(112)

డా. ఆర్. భూపతి రెడ్డి, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) ప్రస్తుత సీజనులో డెంగ్యూ, స్వైన్ ఫ్లూ, ఇతర అంటు వ్యాధులు నివేదించిన విషయం వాస్తవమేనా?

(ఆ) అయితే, జిల్లావారీగా నివేదించిన సదరు కేసుల సంఖ్య ఎంత?

(ఇ) ఎంతమంది రోగులకు చికిత్స అందించడమయింది? సంభవించిన మరణాల సంఖ్య ఎంత ?

(ఈ) ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి (డా. సి. లక్ష్మారెడ్డి):– (అ) అవునండీ. స్వైన్‌ఫ్లూ, ఇతర అంటువ్యాధుల కేసులు నివేదించబడ్డాయి.

(ఆ) అనుబంధం–1ని సభా సమక్షంలో ఉంచడమయింది.

(ఇ) అంటు వ్యాధులకు సంబంధించి 120 మంది రోగులకు చికిత్స చేయగా, 8 మరణాలు సంభవించాయి.

(ఈ) 1. నిఘా వ్యవస్థను పటిష్టపరచడమయింది.

2. ఉచిత రోగ నిర్ధారణ, ఉచిత మందులను సమకూర్చడమయింది.

3. జిల్లా, ప్రాంతీయ బోధనా ఆసుపత్రులలో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేయడమయింది.

4. బోధనా ఆసుపత్రులన్నింటిలో క్రిటికల్ కేర్ సౌకర్యాలను పటిష్ట పరచడమయింది.

5. రోగ నిర్ధారణ పరీక్షా సామర్థ్యాన్ని పెంచడమయింది.

6. సరిపోయేంత పరిమాణంలో మందులు, రోగనిర్ధారణ కిట్లను లభ్యంగా ఉంచడమయింది.

7. ఆరోగ్యశ్రీ క్రింద ఉచిత వైద్య సంరక్షణను సమకూర్చడమైంది.

8. అవగాహన కల్పించడం కోసం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఐఇసి ప్రచారం.

9. సూచనలు, కౌన్సిలింగ్ నిమిత్త 24x7 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడమయింది.

## అనుబంధం - 1

2016, జనవరి 1 నుండి, 2016 అక్టోబరు 18 వరకు పరీక్షించిన 3554 శాంపిళ్లలో 120 హెచ్1ఎన్1 (ఇన్‌ఫ్ల్యూయింజా ఎ) పాజిటీవ్‌వచ్చాయి. 1-1-2016 నుండి 18-10-2016 వరకు జిల్లావారీ పాజిటివ్ కేసులు మరియు మరణాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| వరుస సంఖ్య | జిల్లా పేరు | పాజిటివ్ కేసులు | మరణాల కేసులు |
|---|---|---|---|
| 1. | మెదక్ | 6 | 1 |
| 2. | నిజామాబాద్ | 2 | 0 |
| 3. | వరంగల్ | 6 | 0 |
| 4. | రంగారెడ్డి | 40 | 4 |
| 5. | హైదరాబాద్ | 58 | 0 |
| 6. | మహబూబ్‌నగర్ | 3 | 0 |
| 7. | కరీంనగర్ | 1 | 1 |
| 8. | ఆదిలాబాదు | 1 | 1 |
| 9. | నల్గొండ | 2 | 1 |
| 10. | ఖమ్మం | 1 | 0 |
| | మొత్తం | 120 | 8 |

డా. ఆర్. భూపతిరెడ్డి:(స్థానికసంస్థలు-నిజామాబాద్) అధ్యక్షా, ఒకటైతే వాస్తవం. గత ప్రభుత్వాల కంటే ఇప్పుడున్న ప్రభుత్వం బాగా చేస్తుందనేది వాస్తవం. అయితే నేనిప్పుడు సీజనల్ డీసీజెస్ గురించి ప్రశ్నించడం జరిగింది. అందులో air born diseases and mosquito born diseases ఉంటాయి. ప్రతి సంవత్సరం వర్షాకాలం మొదలు కాగానే జూన్, జూలై మాసాల్లో గానీ, శీతాకాలంలో డిసెంబరు, జనవరి మాసాల్లో గానీ రోగులతో ఆసుపత్రులన్నీ నిండిపోతాయి. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో రోగాలబారిన పడడం రిపీట్ అవుతూనే ఉంది. దోమలబారిన పడి రోగాలు తెచ్చుకున్నటువంటి రోగుల వివరాలు ఏమీ ఇవ్వలేదు. వారి వివరాలు తెలియజేయాలని కోరుతున్నాను.

అదేవిధంగా స్వైన్ ఫ్లూ గురించి 120 పేషెంట్లను గుర్తించడం జరిగిందని, అందులో 8 మంది మరణించారని తెలిసింది. అది కూడా చివరి క్షణంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడం వల్ల ఆ 8 మంది చనిపోవడం జరిగిందని అనుకుంటున్నాను. దోమల నివారణ విషయంలో ప్రభుత్వం ఏమేమి చర్యలు చేపట్టిందో తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ఎన్. రామచంద్ర రావు :(పట్టభద్రుల నియోజక వర్గం - మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ) అధ్యక్షా, డెంగ్యూ ఫీవర్ విషయంలో రోగులు ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాక చాలా మంది రోగులకి ప్లేట్‌లేట్స్ పడిపోయాయని, రోగులకి ప్లేట్‌లేట్స్ ఎక్కించాలంటే అవి కొరత ఉన్నాయని డాక్టర్లు చెబుతుంటారు. వాటిగురించి ప్రభుత్వం ఏమైనా చర్యలు చేపట్టిందా తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు :(స్థానిక సంస్థలు-హైదరాబాద్) అధ్యక్షా, రెగ్యులర్‌గా ప్రతి సంవత్సరం ఈ డెంగ్యూ, మలేరియా వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. చంపాపేట్‌లోని సింగరేణి కాలనీకి చెందిన 22 సంవత్సరాల సహారా బేగం డెంగ్యూ వ్యాధితో చనిపోవడం జరిగింది. ఇప్పుడు ప్రభుత్వం హౌస్‌కి అందజేసిన ఫిగర్స్ అంతా కూడా ప్రభుత్వ ఆసుపత్రులకి సంబంధించినవే, ప్రైవేటు ఆసుపత్రుల్లో చనిపోయిన వారి వివరాలు ఇవ్వలేదు. కానీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చనిపోయిన వారికంటే, ప్రైవేటు ఆసుపత్రుల్లోనే ఎక్కువమంది చనిపోయారు.

High Court Division Bench, Acting Chief Justice Ramesh Ranganathan and Justice Shankar Narayan ప్రభుత్వానికి ఒక నోటీస్ ఇవ్వడం జరిగింది. దాంట్లో క్లియర్‌గా ఏముందంటే, there is inaction of authorities in preventing dengue and malaria. I think it is a comment passed by Acting Chief Justice. అంటే, అధికారులు ఎంతవరకు పనిచేయాలో అంతవరకు పని చేయలేదని దీనిలో క్లియర్‌గా కనపడుతోంది. ప్రభుత్వమేమో ఒకవైపు అన్ని చర్యలు తీసుకుంటుందని చెబుతోంది. ఇంకోవైపేమో ఈ విధంగా కామెంట్స్ వస్తుంటే బహుశా ప్రభుత్వానికి తప్పు పేరు వస్తుందని నేను భావిస్తున్నాను. ఈ అంశం ప్రజల ఆరోగ్యాలకు సంబంధించినది కాబట్టి, ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు చేపట్టాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

బికూ అనే పేషెంట్ ప్రమాదానికి గురై ఖమ్మం నుండి బయలుదేరి గాంధీ ఆసుపత్రికి వచ్చాడు. గాంధీ ఆసుపత్రి డాక్టర్లు పేషెంట్ బ్రతికుండగానే చనిపోయాడని సర్టిఫై చేశారు. ఆ విషయం ఎలా తెలిసిందని అంటే, అతన్ని వారి తల్లిదండ్రులు ఇంటికి తీసుకువెళ్లాక వారి బంధువులందరు వచ్చి ఏడుస్తూ ఉంటే పేషెంట్ అటూ, ఇటూ కదిలారంటా. అంటే ఇది ఎంత నిర్లక్ష్యం అధ్యక్షా. You have acted very promptly but is it not a negligence on the part of a doctor? ఇటువంటి

విషయాలపై సరైన చర్యలు తీసుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీమతి ఆకుల లలిత :(శాసన సభ నియోజక వర్గం) అధ్యక్షా, కామారెడ్డి, నిజామాబాద్ మధ్యలో ఒక ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పరికరాలు సరిగా లేవు, వాటిని కూడా ఏర్పాటు చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

డా. సి. లక్ష్మారెడ్డి : అధ్యక్షా, సీజనల్ డిసీజెస్ ప్రతి సంవత్సరం ముఖ్యంగా వర్షాకాలం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అందుకోరకు గతంలోకంటే ప్రభుత్వం ఇప్పుడు చాలా గొప్పగా చర్యలు చేపట్టడం జరిగింది. గతంలో వర్షాకాలం వచ్చిందంటేనే ఆదిలాబాద్ జిల్లాలో వేలమంది మరణించిన సంఘటనలు మనం గమనించడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు ఉద్యమ సమయంలో ఏజెన్సీ ఏరియాలలో విషజ్వరాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని చెబుతుండేవారు. అటువంటి సందర్భంలో ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు మండలాల్లో ఇటువంటి విష జ్వరాలు వచ్చినప్పుడు ప్రభుత్వ డాక్టర్లు అక్కడికి వెళ్లి, మంత్రులు, శాసన సభ్యులంతా అక్కడ ఉండి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టే అక్కడి వారందరికి అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో మరణాలు తగ్గించడం జరిగింది. అలాగే ఈ సంవత్సరం కూడా మే మాసంలోనే డాక్టర్లందరినీ అలర్ట్ చేసి, మిగతా డిపార్టుమెంట్స్ వారితో కోఆర్డినేట్ చేసుకొని ఒక కమిటీ కూడా ఏర్పాటు చేసుకొని తద్వారా ఈ సంవత్సరం ఒక్క మరణం కూడా లేకుండా చేయడం జరిగింది.

అట్లాగే ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు కొంత మూఢ నమ్మకాలతో ఉంటారని కళా బృందాలతో అక్కడి వారందరికీ లోకల్ భాషలో అవగాహన కల్పించడం జరిగింది. దాంతో ఏజెన్సీ వారంతా డాక్టర్ల వద్దకు రావడం జరిగింది. అందుకని ఎక్కువ మందిని గుర్తించడం జరిగింది. కానీ, వారందరికీ ట్రీట్మెంట్ అందించడం వల్ల మరణాల సంఖ్య తగ్గించడం జరిగింది. మలేరియా రాకుండా ఉండాలంటే దోమలు పెరగకుండా చూసుకునే బాధ్యత మనందరిపైనా ఉంటుంది. అట్లాగే డెంగ్యూ ఫీవర్ అనేది పగటిపూట కుట్టే దోమలద్వారా వస్తుంది. దానికి గాను తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగింది. అన్ని డిపార్టుమెంట్స్ సహకారంతో అందరికీ అవగాహన కల్పించాం. భవిష్యత్తులో అలాంటివి రాకుండా చర్యలు చేపట్టడం జరిగింది. స్వైన్ ఫ్లూ గతంలో ఎక్కువగా ఉండేది, కానీ ఈ సంవత్సరం చాలా తగ్గుముఖం పట్టింది. దానికి కూడా అవసర్మైనటువంటి ప్రత్యేక వార్డులు పెట్టాం, డయాగ్నోస్టిక్ పరికరాలను, మందులను అందుబాటులో ఉంచాం. గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారు అడిగినట్లు 12 ప్లేట్‌లేట్స్ మిషన్స్ 12 ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయడం జరిగింది. దానిద్వారా ప్రజలకు సేవలు కూడా అందించడం జరిగింది.

## మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్ వద్ద పోలీసుల ఎదురు కాల్పులు

ప్రశ్న నెం.1416 (113)

సర్వశ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఎం. రంగారెడ్డి, ఎం.ఎల్.సి.లు:– గౌరవనీయులైన హోం శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ వద్ద పోలీసు ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ నయీముద్దీన్ మరణించిన విషయం వాస్తవమేనా?

(ఆ) ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నయీముద్దీన్ నివాసం నుండి ఒక డైరీని స్వాధీనం చేసుకోగా, దానిలో అనేకమంది ప్రముఖ నాయకులు, పోలీసు అధికారుల పేర్లను పేర్కొన్న విషయం కూడా వాస్తవమేనా ?

(ఇ) అయితే, ఆ వివరాలేమిటి ?

(ఈ) ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన హోం శాఖ మంత్రి (శ్రీ నాయిని నర్సింహారెడ్డి):– (అ) అవునండీ.

(ఆ) మృతి చెందిన నయీముద్దీన్ ఇంటి నుండి కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకోవడమయింది.

(ఇ) వివరాలు దర్యాప్తుకు లోబడి వున్నాయి. చట్ట ప్రకారం చర్య తీసుకోవడమవుతుంది.

(ఈ) ఇప్పటి వరకు మృతి చెందిన నయీముద్దీన్ బాధితుల ఫిర్యాదులపై 173 కేసులను నమోదు చేసి, వివిధ కేసులలో 119 మందిని అరెస్టు చేయడమయింది. ఈ కేసులు దర్యాప్తులో ఉన్నాయి.

**10.40 ఉ.** గత రెండున్నర సంవత్సరాల నుండి నయీం ముఠా భువనగిరిలో దారుణ కార్యకలాపాలు ప్రారంభించి క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించారు. గతంలో చాలా దారుణమైన కార్యకలాపాలు సాగించిన క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నయీం బారిన పడ్డ బాధితులు ఎంతో మంది తమని రక్షించమని మొర పెట్టుకున్నారు. నయీం ముఠా చర్యలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగష్టు 8వ తేదీన షాద్‌నగర్ లోని మిలీనియం టౌన్‌షిప్ పరిసర ప్రాంతాలలో

మారణాయుధాలతో సంచరిస్తున్న నయీంను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు. ఆ సందర్భంలో జరిగిన ఎదురు కాల్పుల్లో నయీం మరణించాడు. ఆ స్థలంలో AK.47 రైఫిల్‌తోపాటు, 9 MM పిస్తోళ్లు, మందుగుండు సామాగ్రి దొరికాయి.

నయీం కేసును దర్యాప్తు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందం సిట్‌ను నియమించింది. దీనిలో 4 బృందాలు ఉంటాయి. ఫిర్యాదుల ఆధారంగా 175 కేసులు నమోదైనాయి. 848 మంది సాక్షులను విచారించి, 124 మంది నిందితులను అరెస్ట్ చేసారు. నయీం స్థావరాల్లో సోదాలు నిర్వహించగా 21 తుపాకులు, 21 కార్లు, 26 మోటార్ సైకిళ్లు, 2 కిలోల బంగారం, రూ.2.95 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నయీం బంధువుల పేర్ల మీద ఉన్న దాదాపు 1500 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 1.67 లక్షల చదరపు విస్తీర్ణం గల ఇండ్ల స్థలాలకు సంబంధించిన ఆస్తి పత్రాలను, 27 గృహాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఆస్తుల మొత్తం రిజిస్ట్రేషన్ విలువ సుమారు రూ. 1.40 కోట్లకు పైగా ఉంటుంది.

27 హత్యలకు సంబంధించిన కేసుల్లో నయీం ముఠా పాత్రను గుర్తించి ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసాము. మరొక 25 హత్యలు చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అతి తక్కువ సమయంలో నయీం ముఠా చేసిన హత్యలకు సంబంధించిన ఆధారాలను పోలీసులు కనుగొన్నారు. రెండు ఛార్జ్ షీట్లను కోర్టులో దాఖలు చేసారు. మరొక 16 ఛార్జ్ షీట్లను తయారు చేసారు. వాటిని త్వరలో కోర్టుకు దాఖలు చేస్తారు. ఇలాంటి ఆరాచక శక్తులను అంతమొందించడంతో ప్రభుత్వాన్ని ప్రజలు అభినందిస్తున్నారు. నయీం కేసులో పోలీసుల సమర్థతను ప్రభుత్వం ప్రశంసిస్తున్నది. ఈ కేసు దర్యాప్తులో ఉన్నందున పత్రాలను, స్వాధీనం చేసుకున్న వస్తువులను, వివరాలను బహిర్గతం చేయడం లేదు. ఈ కేసుకి సంబంధించినవారు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి:(స్థానిక సంస్థలు – నల్గొండ) అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన విషయం. నయీంను చంపి మంచి పని చేసారని ప్రజలందరూ అనుకుంటున్నారు. గత 15 సంవత్సరాల నుండి అతడు చేస్తున్న దారుణాలకు వెనుక ఎవరి ప్రోద్బలం ఉంది? అతడిని చంపి 5 నెలలు అవుతుంది. దీని వెనుక ఉన్న చిన్న, చిన్న లీడర్లను తప్పితే ఏ ఒక్క రాజకీయ నాయకుడిని, పోలీసు అధికారిని గాని ఇంత వరకు అరెస్ట్ చేయలేదు. అరెస్ట్ చేయదలుచుకుంటే దాదాపు 5 నెలల నుండి అన్ని వార్తాపత్రికలలో అతనిని గురించి వచ్చినన్ని వార్తలు ఇంక ఎవరి గురించి రాలేదేమో? వాటి ఆధారంగా ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంది? 15 సంవత్సరాల నుండి అతడు వసూలు చేసిన డబ్బు బినామీల పేర్ల మీద దాదాపు రూ.20,000 కోట్ల ఆస్తి ఉందని, రూ.1000 కోట్ల నగదు ఉంటుందని అనుకుంటున్నారు. ప్రభుత్వానికి ఆ విషయం తెలిసిందా? ప్రభుత్వానికి ఎంత దొరికింది? బినామీ ఆస్తులెన్ని ఉన్నాయి? బహిరంగంగా ప్రభుత్వం ప్రకటించలేదు కాబట్టి ప్రకటించమని తమరి ద్వారా కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: దయచేసి ఒక విషయాన్ని సభ్యులందరికీ తెలియజేస్తున్నాను. ఏ విషయమైతే కోర్టులో ఉంటుందో అప్పుడు శాసన సభగాని, శాసన మండలిలో గాని వాటిని ప్రభావితం చేసే విధంగా మన చర్చలుగాని, చర్యలు గాని ఉండకూడదని, దానికి లోబడే చర్చించాలని అభిప్రాయపడుతున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్: అధ్యక్షా, హోంమినిస్టర్ గారు చాలా స్పష్టంగా నయీం కేసు గురించి వివరించారు. నేను ఆగష్టు 15th తేదీ నాడు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ కేసును సిట్‌కు కాకుండా సిబిఐకి ఇవ్వండి అని చెప్పాను. ఎందుకంటే దీనికి సంబంధించిన వార్తలు చాలా పేపర్లలో అతని దగ్గర AK-47, దాదాపు రూ.1.00 కోటి వరకు నగదు ఎన్‌కౌంటర్లో దొరికాయి అని రాసారు. నగదు అనగానే ఇన్‌కమ్ టాక్స్ వారికి సంబంధించిన కేసు క్రిందకు వస్తుంది. AK-47 అనగానే మిలిటరీ వారికి సంబంధించిన కేసు అవుతుంది. ఈ కేసు ఒక రాష్ట్రంలోనే కాదు 5 రాష్ట్రాలకు వెళ్లి దర్యాప్తు చేయాలంటే మన పరిధి సరిపోదు. ఇన్ని అంశాలతో ఈ కేసు ముడిపడి ఉంది.

جناب ٹی۔ہریش راؤ (Janab T.Harish Rao): اسپیکر صاحب! ایک منٹ صاحب! آپ بات کیجئے صاحب یہ rules book کا Page No.96, Rule No.29: A member while speaking shall not refer to any matter in fact on which judicial decision is pending.

కోర్టులో వ్యవహారం పెండింగ్‌లో ఉండగా సభలో మాట్లాడటానికి కొన్ని పరిమితులున్నాయి. అది ఒక్కటి దృష్టిలో పెట్టుకోండి. కోర్టులో కేసు నడుస్తున్న కారణంగా దీని మీద ఎలాంటి కామెంట్ చేయకూడదు.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్: అధ్యక్షా, వారు చెప్పిన అంశాలు బాగున్నాయి. మరి హోం మినిస్టర్ గారు కూడా ఇదే సభలో 5 పేజీల స్టేట్‌మెంట్ చదివినప్పుడు ఆ సెక్షన్ వర్తించదా? ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్‌కే నేను జవాబు ఇస్తున్నాను. నయీంకి సంబంధించిన డైరీ దొరికిందనేది వాస్తవమా? కాదా? దానిని బయట పెట్టండి. లేకపోతే వెబ్‌సైట్‌లో పెట్టండి?

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: అధ్యక్షా, నయీంకి సంబంధించి 5 రాష్ట్రాలలో కేసులు ఉన్నాయి కాబట్టి CRPS ప్రకారం అన్ని రాష్ట్రాలకు వెళ్లే అధికారం మనకు ఉంది. తెలంగాణ ప్రభుత్వ పోలీసు శాఖ నెం.1అని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది.

(అంతరాయం)

రాజగోపాల్ రెడ్డిగారు మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాల నుండి ఈ నేరాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు? అని అడిగారు. ఇప్పటి వరకు అధికారంలో ఎవరు ఉన్నారు అధ్యక్షా! తెలుగు దేశం, కాంగ్రెసు పార్టీ ఉంది కదా? ఒకాయన పెంచాడు, ఒకాయన పోషించాడు. పెంచి పోషించిన వారు ప్రశ్నలడుగుతున్నారు అంటే చాలా సిగ్గుచేటైన విషయం. అటువంటి వాడిని ప్రభుత్వం పట్టుకోవడానికి ప్రయత్నిస్తే ఎదురు కాల్పుల్లో చనిపోయాడు. పత్రాలను బహిర్గతం చేయరాదు. అలా చేస్తే కేసుకు నష్టం వాటిల్లుతుంది. మాకు ఒక నోట్ బుక్ మాత్రమే దొరికింది. దానిని కోర్టులో సబ్మిట్ చేసాము. దానిని మీకు ఎలా ఇస్తాం. సమగ్ర విచారణ అనంతరం నిందితులను కఠినంగా శిక్షించడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

## పాలెం వాగు ప్రాజెక్టు

ప్రశ్న నెం. 1677 (114)

శ్రీ బలసాని లక్ష్మీనారాయణ, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) జయశంకర్– భూపాలపల్లి జిల్లా, వెంకటపురం మండలంలోని పాలెం–వాగు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పని ప్రగతి ఏమిటి?

(ఆ) ఇప్పటివరకు అయిన వ్యయం, విడుదల చేసిన నిధుల వివరాలేమిటి?

(ఇ) ఎప్పటిలోగా పనులను పూర్తి చేయడమవుతుంది?

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి (శ్రీ టి. హరీష్ రావు):– (అ) దాదాపు 95 శాతం పాలెం–వాగు ప్రాజెక్టు పని పూర్తయింది.

(ఆ) 2016, నవంబరు వరకు చేసిన వ్యయం రూ.199.36 కోట్లు, విడుదల చేసిన నిధులు రూ.199.36 కోట్లు.

(ఇ) 31-05-2017 తేదీనాటికి పనులను పూర్తి చేయడమవుతుందని ఆశించడమయింది.

(ఈ) ప్రాజెక్టు క్రింద ప్రతిపాదించిన ఆయకట్టు 10,132 ఎకరాలు, ఇప్పటివరకు 5000 ఎకరాలకు సాగునీటిని కల్పించడమయింది.

**11.00 ఉ.** శ్రీ బలసాని లక్ష్మీ నారాయణ:(స్థానిక సంస్థలు - ఖమ్మం) అధ్యక్షా, ఈ ప్రాజెక్టు భద్రాచలం నియోజక వర్గంలో మా స్వంత మండల పరిధిలో ఉంటుంది. దీనికి సంబంధించిన పనులు 2005, డిసెంబర్‌లో ప్రారంభమయినాయి. సుమారుగా రూ.75 కోట్ల నిధులు కేటాయించడం జరిగింది. ఈ రోజు వరకు దాదాపు రూ.199 కోట్లు ఖర్చయినట్లు మంత్రిగారు సమాధానంలో చెప్పారు. నేను శాసన మండలికి 2009లో వచ్చినప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ ప్రాజెక్టు గురించి ప్రశ్న అడుగుతూనే ఉన్నాను. ప్రతి ప్రాజెక్టుకి ప్రారంభపు తేదీలు, శంఖుస్థాపన తేదీలు ఉంటాయి. కాని ఈ ప్రాజెక్టుకి సంబంధించి ప్రతి సంవత్సరం ఆగస్టు 4వ తేదీ వచ్చిందంటే అక్కడ ప్రజలందరూ భయపడుతుంటారు. ఎందుకంటే ఖచ్చితంగా అదే రోజున కట్ట తెగిపోతుంటుంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఈ పనులను కాంట్రాక్టర్‌కి అప్పగిస్తూ ఉంటుంది. దురదృష్టం ఏమిటంటే ప్రతి సంవత్సరం కూడా అదే కాంట్రాక్టరుకి ఈ తెగిన కట్టకు సంబంధించిన పనులను అప్పగిస్తుంటుంది. అతని వల్లనే నష్టం జరిగింది. ప్రాజెక్టు వ్యయం పెరిగింది. అయినప్పటికీ ఆ కాంట్రాక్టర్‌నే కొనసాగిస్తున్నారు. నేను ఈ విషయం గురించి గతంలో ఒకసారి మంత్రిగారికి చెప్పాను. రెండు సంవత్సరాల నుండి రైట్ కెనాల్‌కు నీళ్లు వదిలారు. అది సంవత్సరం పొడుగునా నీటిని కలిగి ఉండే జీవనది. ఐదు వేల ఎకరాల వరకు సాగు అవుతున్నది. రబీలో కూడా కొంత పంట వేస్తున్నారు. కాని లెఫ్ట్ కెనాల్‌కు పదివేల ఎకరాలకు నీరు రావలసి ఉంది. కాని ఐదు వేల ఎకరాలకు మాత్రమే నీటిని ఇచ్చారు. మరి ఈ ప్రాజెక్టు పనులు ఎప్పటివరకు పూర్తవుతాయి? నా యొక్క ప్రతిపాదన ఏమిటంటే అది గిరిజన ప్రాంతం. ఇది ఛత్తీస్‌ఘడ్‌కి బోర్డర్‌లో ఉంటుంది. నీళ్లు ఉన్నప్పటికి కూడా వాడుకోలేని పరిస్థితి. దయచేసి ప్రభుత్వమే షెట్టర్స్‌ను పెట్టినట్లయితే పదివేల ఎకరాలకు నీటి వసతి లభిస్తుంది. మరొక మనవి ఏమిటంటే 2005 నుండి కాలువలు తవ్వారు. నేడు అవి పూడిపోయాయి. చెట్లు మొలిచాయి. కొద్దిగా ఎక్కువ ఖర్చు అయినప్పటికీ, కాలువలను పునరుద్ధరించి, చెత్తను తొలగించినట్లయితే, రైతులకు ఉపయోగపడుతుందని మనవి చేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి: అధ్యక్షా, అక్కడ పనులు చేస్తున్న ఏజెన్సీ పేరు ఏమిటి? కట్ట రెండుసార్లు తెగిపోయింది. అదే ఏజెన్సీ కంటిన్యూ అవుతున్న నేపథ్యంలో, ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టవలసి

ఉంది. వారికి వేరే చోట్ల కూడా పనులు అప్పగించినారా? ఇప్పుడున్న బడ్జెట్‌ను పెడితే మనకు కొత్త ప్రాజెక్టు తయారయ్యేది. వారి సామర్థ్యం పట్ల అనుమానాలు ఉన్నప్పుడు, ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

శ్రీ టి. హరీష్ రావుః అధ్యక్షా, గౌరవనీయులు లక్ష్మీ నారాయణగారు చెప్పినట్లుగా, EPC విధానంలో జరిగిన పాపాలకు ఇదొక ఉదాహరణ. ఈ EPC విధానంలో ఎంత అన్యాయం జరిగింది, ఎన్ని అవకతవకలు జరిగాయి, ఎన్ని రకాలుగా ఇబ్బందులు ఎదురైనాయో చెప్పడానికి ఈ ప్రాజెక్టు ఒక ఉదాహరణ. అందుకే టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ EPC విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, మేము Non-EPC విధానం తీసుకువచ్చాము. ఈ పాలెంవాగు ప్రాజెక్టుకి 2005లో రూ.70 కోట్లకు టెండర్లు పిలిచారు. ఈ పద్ధతిలో కాంట్రాక్టర్లే డిజైన్ చెయ్యాలి, వాళ్లే ప్రాజెక్టు కట్టాలి. దాంతో తప్పుడు డిజైన్ చేయడం వల్ల ఏం జరిగింది? సాధారణంగా గేట్లు ప్రాజెక్టు మధ్యలో పెడతారు. కాని వాళ్లు గేట్లు పెట్టకుండా, తక్కువ ఖర్చుతో ప్రాజెక్టు పూర్తి చేసి, ఎక్కువ డబ్బు మిగుల్చుకునే EPC విధానంలో పనులు చేశారు. వారు గేట్లు పెట్టకుండా, కేవలం అలుగుకట్టి, దాంతో సరిపెట్టారు. అందువల్ల 4-8-2006 నాడు వరదలు వచ్చి, కొంత మేరకు కొట్టుకుపోయింది. తరువాత ప్రభుత్వం ఒక కమిటీ వేసి, ఎందుకు ఇలా జరిగింది అని ఆలోచన చేశారు.

మళ్లీ ఇంకొకసారి 4-8-2008 నాడు మళ్లీ వరదలు వచ్చి, ఇంకొకసారి కట్ట తెగిపోయింది. ఇలా రెండు సార్లు కట్ట తెగిపోయింది. Expert Committee ఇచ్చిన రిపోర్టులో ఏముందంటే క్రింద ఫ్లడ్ ఎక్కువ ఉంది, గేట్లు పెట్టలేదు. దీన్ని మొత్తంగా మార్చి 3 ప్లస్ 1 = 4 గేట్లు పెట్టాలని రిపోర్టులో పేర్కొనడం జరిగింది. అదే విధంగా ఫ్లడ్‌ను కూడా తక్కువగా అంచనా వేశారు. సాధారణంగా 50,000 క్యూసెక్కుల ఫ్లడ్ ఉంటే, అదనంగా మరొక 36,000 క్యూసెక్కులు కలిపి, మొత్తం 86,000 క్యూసెక్కులకు గేట్లు పెట్టాలని అంచనా వేసి, ఇప్పుడు మేము పనులు మొదలుపెట్టాము. EPC విధానంలో డబ్బులు మిగులుస్తాము, పనులు తొందరగా చేస్తాము అంటే జరిగింది ఏమిటి? రూ.70 కోట్లతో అంచనా వేసిన పనులు ఈ రోజు రూ.240 కోట్లు అవసరమవుతోంది. అంటే ఎంత నష్టం జరిగింది? సమయం చూస్తే 2005లో టెండర్లు పిలిస్తే, ఈ రోజు టిఆర్ఎస్ వచ్చిన తరువాత 2015లో 5,000 ఎకరాలకు నీళ్లు ఇవ్వగలిగాము. ఈ మే నాటికి మొత్తం 10,132 ఎకరాలకు నీళ్లు ఇచ్చే దిశగా పనులు చేస్తున్నాము. అటవీ అనుమతుల కొరకు డబ్బు కట్టవలసి వచ్చింది. CAMPAకు రూ.1.23 కోట్లు కట్టి, దానికి క్లియరెన్సు కూడా తీసుకువచ్చి, పనులు వేగంగా జరిపిస్తున్నాము. సభ్యులు శ్రీ లక్ష్మీనారాయణగారు చెప్పినట్లు ఆ గేట్లు కూడా సిద్ధం చేస్తున్నాము. జనవరి లేదా ఫిబ్రవరి చివరికి గేట్లతో పాటు, కెనాల్‌కి సంబంధించిన పనులు పూర్తిచేసుకుని, 2017 ఖరీఫ్‌కు టోటల్ 10,000 ఎకరాలకు నీళ్లిచ్చే విధంగా ప్రభుత్వం ముందుకు పోతుందని మనవి చేస్తున్నాను.

ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఐదు వేల ఎకరాలకు నీళ్లిచ్చాము. ఇప్పుడు రబీ రెండవ పంటకు కూడా మరో రెండు వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వబోతున్నామని మీ ద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. ఏజెన్సీ పేరు గురించి అడిగారు. అది ALS & KVR అని ఒక జాయింట్ వెంచర్‌తో వారు పనులు చేస్తున్నారు. దాదాపు ఇంకొక రూ.28 కోట్ల పనులు జరగవలసిన అవసరం ఉన్నది. వచ్చే 3,4 నెలల్లో ఈ పనులన్నీ పూర్తి చేసి, రెండు పంటలకు పది వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చుకునే అవకాశం ఉంది. అది 1.27 టిఎంసిల కెపాసిటీ ఉన్న రిజర్వాయర్. గేట్లు పెట్టకపోవడం వల్ల ఈ సంవత్సరం కేవలం 0.72 టిఎంసిల నీటిని మాత్రమే స్టోర్ చేయగలిగాము. మే నాటికి మేము గేట్లు పెట్టి, వచ్చే ఖరీఫ్‌నాటికి టోటల్ 1.27 టిఎంసిల నీటిని నింపి, రెండు పంటలకు కూడా పాలెంవాగు క్రింద ఖచ్చితంగా ఆయకట్టుకి నీరు అందిస్తాము. దానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మనవి చేస్తున్నాను.

## గొలుసు అపహరణలు మరియు ఆకతాయివేధింపుల కేసులు

ప్రశ్న నెం. 1697 (115)

శ్రీ కర్నె ప్రభాకర్, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన హోం శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

(అ) మహిళలపై జరుగుతున్న అసాంఘీక కార్యకలాపాలపై పోలీసులు తీసుకున్న చర్యలేమిటి;

(ఆ) చైన్ స్నాచింగ్ , ఈవ్‌టీజింగ్‌కి సంబంధించి నమోదైన కేసుల సంఖ్య ఎంత ?

గౌరవనీయులైన హోం శాఖ మంత్రి (శ్రీ నాయిని నర్సింహా రెడ్డి):- (అ) మహిళలపై జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఈ క్రింది చర్యలను తీసుకుంటున్నారు.

- స్నాచింగ్ నేరాల నివారణ, పరిశోధన కోసం డేకాయ్‌కాప్ సహాయంతో ట్రాప్ వేస్తూ నేరం జరిగే అవకాశమున్న ప్రాంతాలలో ఫుట్ పెట్రోలింగ్‌ను పెంచడమయింది.

– పిడి చట్టం క్రింద కరడుగట్టిన చైన్ స్నాచర్‌లను నిర్బంధించడమవుతున్నది.

– సమాజానికి ప్రమేయం కల్పిస్తూ నేరం జరిగే అవకాశమున్న అన్ని ప్రాంతాలలో వ్యాపార సంస్థలు, ముఖ్యమైన జంక్షన్లలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయడమవుతున్నది. నేరాలను, నేరాలతో సంబంధం గల నేరస్థులను సమర్థవంతంగా కనుగొనడానికి సిసిటివిలను వినియోగించడమవుతున్నది.

– చెడు ప్రవర్తన కలవారు, అనుమానితులు, మాజీ నేరస్తులు, సిడిసిలు మున్నగువారి కార్యకలాపాలపై క్రమబద్ధ నిఘాను ఉంచడమవుతున్నది.

– ఈవ్‌టీజింగ్ కేసులను నియంత్రించడానికి కొత్తగా ఏర్పడిన జిల్లాలు, కమిషనరేట్లన్నింటితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 221 షీ బృందాలను ఏర్పాటు చేయడమయింది.

– డయల్ 100 ఈవ్‌టీజింగ్ బాధితుల సురక్షిత యంత్రంగా మారింది.

(ఆ) (i) 2016, నవంబరు వరకు 2443 చైన్ స్నాచింగ్ కేసులు నమోదు అయ్యాయి.

(ii) 2016, నవంబరు వరకు 683 ఈవ్‌టీజింగ్ కేసులు నమోదు అయ్యాయి.

శ్రీ కర్నె ప్రభాకర్: (నామినేటెడ్) అధ్యక్షా, మంత్రిగారి నుండి సంతృప్తికరమైన సమాధానం వచ్చినప్పటికీ, నేను ఒకటి, రెండు సూచనలు చేయదలచుకున్నాను. Habitual offenders ఎవరైతే ఉన్నారో, వారు పదేపదే ఈ నేరాలకు పాల్పడుతుంటారు. మంత్రిగారు చెప్పారు అటువంటి నేరస్తులపై పి.డి. చట్టం ప్రయోగిస్తున్నామని. చట్టాలను సవరించి, ఇంకా తీవ్రమైనటువంటి చట్టం ప్రయోగించి, వాళ్లు మళ్లీ అటువంటి నేరాలు చేయకుండా చేసే ఆలోచన ప్రభుత్వం వద్ద ఉన్నదా? రెండవది ఇటువంటి నేరాలు అదుపులోకి రాలేదని చెప్పవచ్చు. సిసి కెమేరాలు పెంచుతున్నామని చెప్పారు. అందులో భాగంగా ఇక్కడ ఉన్న గౌరవ సభ్యులంతా తమ నిధులు కేటాయించారు. నేను కూడా నాగోలులో ఒక ఐదు లక్షల రూపాయలు, చౌటుప్పల్‌లో ఐదు లక్షలు, సంస్థాన్ నారాయణ్ పురంలో ఒక ఎనిమిది లక్షలు ఇచ్చుకుంటూ వచ్చాము. ఐతే ఈ కెమేరాల ఏర్పాటులో చిన్న సవరణ చేయవలసిన అవసరం ఉంది. ఈ కెమేరాలు సప్లై చేయడానికి ఒక ఏజెన్సీకి అప్పగిస్తున్నారు. ఆ ఒక్క ఏజెన్సీకి మాత్రమే కాకుండా, ఇంకా ఎవరైనా అంతకంటే తక్కువ ధరకు సప్లై చేయదలచుకుంటే అటువంటి వారికి కూడా అవకాశం కల్పించండి. పర్టిక్యులర్‌గా ఒక సంస్థకే కాకుండా, ఏజెన్సీలను పెంచే విషయం గురించి ఆలోచించండి.

శ్రీ ఎం.ఎస్. ప్రభాకరరావు: అధ్యక్షా, ముందుగా నేరాలను సమర్థవంతంగా అరికడుతున్న హోం మినిస్టర్‌గారికి నా అభినందనలు. నిన్ననే హైదరాబాద్ గురించి పోలీస్ కమీషనర్‌గారు ఒక నివేదికను విడుదల చేశారు. అందులో హైదరాబాద్‌లో క్రైమ్ రేటు గణనీయంగా తగ్గిందని చెప్పడం జరిగింది. క్రైమ్ రేటులో 13 శాతం, ఆస్తి తగాదాలు 16 శాతం తగ్గినాయని వారు చెప్పారు. అలాగే హత్యల విషయంలో 25 శాతం, మహిళల వేధింపులు 18 శాతం, సైబర్ నేరాలు 24 శాతం తగ్గినట్లు ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఓవరాల్‌గా హైదరాబాద్‌లో క్రైమ్ రేటు 8 శాతం తగ్గినట్లు చెప్పారు. చాలా సంతోషంగా ఉంది. ఇందుకు గర్వపడుతున్నాను. At the same time డ్రగ్ కేసులు మాత్రం పెరిగిపోయాయి. మిగతా నేరాలన్నీ తగ్గినాయి కాని, ఈ డ్రగ్ కేసులు 100 శాతం పెరగడం జరిగింది. 2015లో 26 డ్రగ్ కేసులు నమోదుకాగా, 2016లో 55 కేసులు రిజిస్టరైనాయి. బ్రౌన్‌షుగర్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలను అరికట్టడానికి ప్రత్యేకమైన చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా? ఇప్పుడు మనకు లేటెస్ట్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది కాబట్టి, దీనిని వాడుకుని ఈ నేరాలను అరికట్టడానికి ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటున్నదా? ఎందుకంటే యువతరం వాటికి అలవాటు పడుతున్నారు. సమాజం పాడైపోవడానికి అవకాశం ఉంది కాబట్టి, మంత్రిగారు ఈ విషయంలో ఏమి చర్యలు తీసుకుంటున్నారో తెలుపవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ డి. రాజేశ్వరరావు: (నామినేటెడ్) అధ్యక్షా, ప్రభుత్వం మంచి కార్యక్రమాలు చేపడుతూ, నేరాలను అరికడుతున్నందుకు ముందుగా నా అభినందనలు. నేను ఈ సందర్భంగా ఒక చిన్న సంఘటన గురించి చెప్పదలచుకున్నాను. మా కాలనీలో ఒక మహిళ ఒక ఇంట్లో పనిచేయడానికి ఉదయాన్నే ఇంటినుంచి అక్కడికి బయలుదేరి వెళ్లింది. ఇద్దరు వ్యక్తులు ఆమెని అనుసరించి, అవకాశం చూసి, ఆమె మెడలోని గొలుసుని లాక్కుని, ఆమెను క్రింద పడేసి, పారిపోయారు. ఆమెకు దెబ్బలు తగిలాయి. నా గొలుసు పోయిందని ఏడ్చి, కేకలు పెట్టింది. ఎవరూ పట్టించుకోలేదు. ఒంటికి అంటుకున్న దుమ్ముని తుడుచుకుని అక్కడనుంచి వెళ్లిపోయింది.

ఆ మరుసటి రోజు అదే సమయానికి ఆమె పని కోసం వెళుతుంటే, దారిలో నిన్నటి దొంగలు ఇద్దరూ ఆమెని అడ్డగించి, నాలుగు దెబ్బలు కొట్టి, బంగారు గొలుసు పెట్టుకోకుండా, డూప్లికేటు గొలుసు పెట్టుకుంటావా అని తిట్టి, ఆ గొలుసు ఆమె మొహం

మీదకు విసిరి, వెళ్లిపోయారు. నేరాలు జరిగే తీరు ఈ విధంగా ఉంది. వాటిని అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకోవలసి ఉందని మనవి చేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: అధ్యక్షా, మహిళల భద్రత అనేది చాలా ప్రధానమని ప్రభుత్వం భావించి, ఎన్నికల ముందే మా ప్రభుత్వం మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ, ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడం జరిగింది. ఆ దిశగా అనేక చర్యలు తీసుకుంటున్నాము. ఒక్క హైదరాబాదులోనే 67 మంది నేరస్తుల మీద పి.డి. చట్టం ప్రయోగించడం జరిగింది. On timeలోనే ముద్దాయిలను విచారించి, వారికి శిక్షపడే విధంగా చూస్తున్నాము. 2014లో 523 నేరాలు నమోదు కాగా, 2015లో 271 నేరాలు నమోదైనాయి. 2016లో 91 కేసులు నమోదైనాయి. కేసులు తగ్గినాయి. నేరస్తులను వెంటనే పట్టుకుని, శిక్షించడం జరుగుతున్నది. సిసి కెమేరాల వల్ల చాలా ప్రయోజనముంటున్నది. నేరస్తులను వెంటనే కనుగొనగలుగుతున్నాము. గత సమావేశాలు జరుగుతున్న సమయంలోనే, బ్రహ్మానందరెడ్డి పార్కు దగ్గర ఒక పారిశ్రామికవేత్తను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. ఆ నేరానికి పాల్పడిన వ్యక్తి ఒక సస్పెండెడ్ కానిస్టేబుల్. అతని పేరు ఓబులేసు. అక్కడే బ్యాగు పారేసి, పారిపోయాడు. మా పోలీస్‌కి ఆ బ్యాగులో పోయిన AK.47 తుపాకి దొరికింది. అందులో బట్టలు కొన్న ఒక రశీదు కూడా దొరికింది. దాని ఆధారంగా ఆ షాపుకి వెళ్లి, సిసి కెమేరాని పరిశీలిస్తే, ఆ కిడ్నాప్‌కి ప్రయత్నించిన వ్యక్తి ఓబులేసుగా ఐడెంటిఫై చేయడం జరిగింది. కర్నూల్‌లో ఉంటే, ఇరవైనాలుగు గంటల్లో అతడ్ని పట్టుకుని, కోర్టులో ప్రవేశపెట్టాము.

అదే విధంగా బేగంబజార్‌లో ఒక ప్లాస్టిక్ కంపెనీ యజమాని కొడుకుని కిడ్నాప్ చేసి, సికింద్రాబాద్ తీసుకుపోతుంటే, సిసి కెమేరాల ద్వారా నేరస్తుడిని గుర్తించి, పట్టుకున్నాము. ఆ బాలుడి ముక్కు దగ్గర మాస్క్ పెట్టడం వలన, ఊపిరాడక చనిపోతే, ఆ బాలుడిని వదిలిపెట్టి, ఒరిస్సాకు పారిపోయాడు. మా పోలీసులు అక్కడికి వెళ్లి, 24 గంటల్లో బంధించారు. కోర్టులో ప్రొడ్యూస్ చేశారు. ఈ విధంగా నేరాలను అరికట్టడానికి సిసి కెమెరాలు చాలా ఉపయోగపడుతున్నాయి. ఒక్క సిసి కెమెరా వందమంది కానిస్టేబుళ్ల పనిచేస్తుంది. ఇంకా విరివిగా ఈ సిసి కెమెరాలను పెట్టి, నేరాలను అరికడదాం. ప్రజాప్రతినిధులందరూ వీటి కొనుగోలుకు నిధులు సమకూరుస్తున్నారు. శ్రీ కర్నె ప్రభాకర్‌గారు అడిగారు చట్టాలను మార్చే ప్రతిపాదన ఏదైనా ఉందా అని. ఉన్న చట్టాలను కఠినంగా అమలుచేస్తున్నాము. తప్పకుండా నేరాలు అరికట్టబడతాయి. ఆ విధంగా పోలీసులు కృషిచేస్తున్నారు. చాకచక్యంతో వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు పి.డి. చట్టం ప్రయోగిస్తుండడంతో, చాలామంది నేరస్తులు భయపడుతున్నారు. నేరాలు చేయడానికి వారు వెనుకంజ వేస్తున్నారు. అందరి సహకారంతో పోలీస్ డిపార్టుమెంటు నేరాలను అరికట్టడానికి మరింత కష్టపడి పనిచేస్తుందని ఈ సందర్భంగా మనవి చేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

**11.20 ఉ.** **దేవాదుల ప్రాజెక్టు మూడవ దశ పనులు**

ప్రశ్న నెం.1548 (12)

సర్వశ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు, పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎం.ఎల్.సిలు:– గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) దేవాదుల ప్రాజెక్టు మూడవ దశ పనుల ప్రస్తుత స్థితి ఏమిటి?

ఆ) ఎప్పటిలోగా ప్రాజెక్టును పూర్తి చేయడమవుతుంది?

ఇ) జనగాం ప్రాంతంలో అనావృష్టి పరిస్థితిని శాశ్వతంగా నివారించడానికి దేవాదుల ప్రాజెక్టు మూడవ దశ క్రిందికి తీసుకురావల్సిన ఆయకట్టు వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి (శ్రీ టి.హరీష్‌రావు):– (అ) జెసిఆర్‌డిఎల్ఐఎస్ IIIవ దశ పనులు పురోగతిలో ఉన్నాయి. కొన్ని ప్యాకేజీల రీ– ఇంజనీరింగ్ ఆమోదాలు ప్రాసెస్‌లో ఉన్నాయి. 2016, నవంబరు 30 నాటికి పనుల మొత్తం పురోగతి 59.52 శాతం.

(ఆ) 2018 నాటికి IIIవ దశ క్రింద పనులను పూర్తిచేయాలని ప్రణాళికను రూపొందించడమయింది.

(ఇ) దేవాదుల ప్రాజెక్టు మూడవ దశ క్రింద జనగామ జిల్లాలో ప్రతిపాదించిన ఉద్దేశిత ఆయకట్టు దాదాపు 1,56,101 ఎకరాలు.

శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు: (శాసన సభ నియోజక వర్గం) అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా ఉంది. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన జనగాం జిల్లా శాశ్వత కరువు ప్రాంతం. గత మూడు సంవత్సరాల నుంచి దేవాదుల ఫేజు –1, 2 ల ద్వారా నీరందించడం జరుగుతోంది. ఈసారి నూటికి నూరు శాతం చెరువులు నింపడం జరిగింది. అందుకు గౌరవ ముఖ్యమంత్రిగారికి, గౌరవ నీటిపారుదల శాఖామంత్రిగారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇప్పటి వరకు ఫేజు–1 మరియు 2 ద్వారా ఈ జిల్లాకి నీళ్లు వస్తున్నాయి. ఫేజు–3 కి సంబంధించి ఇంకా భూసేకరణ చేయవలసి ఉంది, ఎప్పటిలోగా ఆ భూసేకరణ పూర్తి చేస్తారు? ధర్మసాగర్ రిజర్వాయర్‌కి నీళ్లు వస్తే అక్కడి నుంచి జనగాం

ప్రాంతానికి నీళ్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. జనగాం జిల్లాకి సంబంధించి 2,3,4,8 ప్యాకేజీలను ఎప్పటి వరకు పూర్తి చేస్తారో చెప్పాలని కోరుతున్నాను. బచ్చన్నపేట కరువు మండలం. కేంద్ర, రాష్ట్ర బృందాలు ఏవి వచ్చినా ఆ ప్రాంతాన్ని సందర్శించడం జరుగుతోంది. అటువంటి చెరువును గత 30 సంవత్సరాల నుంచి నింపలేదు కానీ ఈసారి దేవాదుల నుంచి నింపుకోవడం జరిగింది. కాబట్టి ఆ మండలంలో ఏదైనా రిజర్వాయరును నిర్మించే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? దయచేసి చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, జనగాం జిల్లాలో గతంలో ఉన్న ప్రాంతం కూడా కరువు కాటకాలతో ఉన్న ప్రాంతం. అది దుర్భిక్ష ప్రాంతం, మెట్టప్రాంతం. కాలువలతో వ్యవసాయం చేసే రీతిగా లేదు. ఆరోజుల్లో కాకతీయ రాజులు అక్కడ చెరువులు త్రవ్వించడం జరిగింది. ఆ చెరువులన్నీ నిండితే వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంది. సాగునీటి పారుదల శాఖామంత్రిగారికి ఆ ప్రాంతం మీద పూర్తి అవగాహన ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మూడో దశ క్రింద ఆ పనులన్నీ పూర్తి చేయాలనే సంకల్పంతో ఉంది. దాన్ని సత్వరమే పూర్తి చేయాలనే ఆలోచన ఉన్నది. ఇక్కడ గండిరామారం రిజర్వాయరు, బొమ్మకూరు రిజర్వాయరు, వెల్దండ రిజర్వాయరు, తపాసుపల్లి రిజర్వాయరు .. ఈ నాలుగు రిజర్వాయర్లను పూర్తి చేస్తే 45 గ్రామాలు సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంటుంది. గ్రౌండ్ వాటర్ పెరిగే అవకాశం వస్తుంది. దేవాదుల ద్వారా ఇక్కడ ఉన్న చెరువులన్నీ నింపుకుంటే ఎండాకాలంలో గానీ, కరువు ఉన్నప్పటికీ ఇబ్బంది ఉండదు. నేను ఎండాకాలం అక్కడికి వెళ్లాను, దేవాదుల ప్రాజెక్టు నుంచి నీళ్లు తీసుకొచ్చి వెల్దండ చెరువు నింపడం వల్లవానకాలంగా ఉన్న పరిస్థితి కనబడింది. అందుకే ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాను, ఈ నాలుగు రిజర్వాయర్లను పూర్తి చేస్తే ఈ గ్రామాలన్నీ కూడా సస్యశ్యామలం అవుతాయి కాబట్టి యుద్ధ ప్రాతిపదిక మీద ఈ రిజర్వాయర్లను పూర్తి చేసే అవకాశం ఉన్నదా? చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

డా.పల్లా రాజేశ్వరరెడ్డి: అధ్యక్షా, దేవాదులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న కాలువల్లో ముఖ్యంగా ధర్మసాగర్ ఎగువ ప్రాంతమైన గండి రామారం ప్రాంతంలో గత సంవత్సరం మన ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ పైపు లైన్లు పగలగొట్టి పంటలు వేసుకున్నారని అనేక కేసులు ఇంతకు ముందు పెట్టబడ్డాయి. ఈ సంవత్సరం కొన్ని అవుట్‌లెట్స్ కూడా ఇచ్చారు, అందుకు మంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ధర్మసాగర్ క్రింది నుంచి గండి రామారం పైపులైను పోతుంటుంది. కానీ ఆ ప్రాంతంలో ఉన్న చెరువులు నింపుకోవడానికి ప్రజలు ఇబ్బంది అవుతోంది. కొన్ని చోట్ల అవుట్‌లెట్స్ ఇచ్చారు. ఇంకా అవుట్‌లెట్స్ పెంచవలసిన అవసరం ఉంది. గండిరామారం, మల్కాపురం మధ్య కొత్త రిజర్వాయరు కోసం ప్రతిపాదనలున్నాయని తెలిసింది, ఉంటే ఎప్పటి వరకు దాన్ని కంప్లీటు చేయవచ్చో తెలియజేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ టి. హరీష్‌రావు: అధ్యక్షా, తెలంగాణ ఉద్యమ ప్రభావంతో గత ప్రభుత్వాలు పూర్తిస్థాయి ప్రణాళిక లేకుండానే ఆరోజుల్లో దేవాదుల ప్రాజెక్టును చేపట్టారు. తదుపరి గౌరవ ముఖ్యమంత్రిగారు దీనిగురించి బాగా ఆలోచించారు. దేవాదులలో మొత్తం 5,43,750 ఎకరాలకు నీళ్ళివ్వాల్సి ఉంది. అయితే 38 టి.ఎం.సిల నీటిని మాత్రమే ఈ ఆయకట్టుకు కేటాయించినందున, మొత్తం 5,43,750 ఎకరాలకు ఆ నీటిని ఇచ్చే అవకాశం లేదు. గోదావరి జలాల్లో మన తెలంగాణ రాష్ట్రానికి వాటా, హక్కు ఉందనే విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు దృష్టిలో పెట్టుకుని దేవాదుల ప్రాజెక్టుకు 60 టి.ఎం.సిల నీటి కేటాయింపులు పెంచారు.

ఈరోజు తుపాకుల గూడెం దగ్గర బ్యారేజ్ నిర్మాణం పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. దేవాదుల ప్రాజెక్టు కట్టినవాడు సంవత్సరానికి 180రోజులు నీళ్ళు తీసుకుంటామని చెప్పారు కానీ ఏ సంవత్సరం కూడా 80, 100రోజులకు మించి నీళ్ళు తీసుకునే పరిస్థితి రావడంలేదు. వచ్చే సంవత్సరానికి బ్యారేజి పనులు కొంత ముందుకు వచ్చినప్పటికి రింగుబండ్ చేసుకోవడంద్వారా వచ్చే సంవత్సరం నుంచే దేవాదుల ప్రాజెక్టుయొక్క లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తిస్థాయిలో పనిచేసుకునే అవకాశాన్ని మనం తెచ్చుకోబోతున్నాము. అయితే గౌరవ సభ్యులందరూ కూడా అన్నట్లుగా దేవాదుల ఫేజ్–3 పూర్తయితే తప్ప మనకు నీళ్ళు వచ్చే అవకాశంలేదు. నీళ్ళు ప్రతిపాదించిన 38 టి.ఎం.సిలలో ఫేజ్–3లోనే 25 టి.ఎం.సిలు ఉన్నాయి. అయితే ఆ ఫేజ్–3లో సాయిల్‌సమస్య, రామప్ప దేవాలయం సమస్య వల్ల గత మూడు, నాలుగు సంవత్సరాలుగా పనులన్నీ ఆగిపోయే పరిస్థితి వచ్చింది. ఈ మధ్యనే ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంవల్ల అది తుది దశకు చేరుకుంది. దీనివల్ల ఫేజ్–3ని వేగవంతంగా పూర్తిచేసుకుని 2017 సంవత్సరానికి అదనంగా మరొక 1,34,000 ఎకరాలు తేవాలని, 2018 సంవత్సరానికి పూర్తిస్థాయిలో పనిచేసే స్థితిగా ప్రభుత్వం ముందుకు పోతోంది.

ఈ సంవత్సరం దాదాపు ఒక్క జనగాం జిల్లాలోనే 102 చెరువులు నింపినాము. అత్యధిక కరవు, దుర్భిక్ష ప్రాంతమైన మద్దూరు, చేర్యాల, బచ్చన్నపేట, జనగామ రూరల్ ప్రాంతాలలోని

102 చెరువులను నీటితో నింపడం ద్వారా మంచి పంటలు కూడా పండుతున్నాయి. అదేవిధంగా అక్కడున్న నాలుగు రిజర్వాయర్లను తొందరగా పూర్తిచేసి పూర్తి ఆయకట్టుకు నీరివ్వాలని పాతూరు సుధాకర్ రెడ్డిగారు అన్నారు. ఆ రిజర్వాయర్లను ఆల్‌మోస్ట్ పూర్తిచేస్తున్నాము. అయితే అక్కడ భూసేకరణ వంటి అంశాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుగారు అన్నట్లుగా ఇంకో 6000 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉంది. ఈ భూసేకరణలో ఉన్న ఇబ్బందులు తొలగించడానికే భూసేకరణ చట్టం తెచ్చినాము. ఆ కరువు ప్రాంతాలలో భూసేకరణ జరిగి దేవాదుల ప్రాజెక్టు ఎప్పుడు మొదలవుతుంది? తెలంగాణ ఉద్యమం మొదలైన 2001 సంవత్సరంలో దేవాదుల మొదలైంది. మనం 2016 సంవత్సరంలో ఉన్నాము. 15 సంవత్సరాల తరువాత దేవాదులలో ఇంకా సేకరించాల్సిన భూమి ఎంతంటే 6045 ఎకరాలు. అంటే ఎన్ని ఇబ్బందులు ఉన్నాయో మీరు అర్థం చేసుకోవాలి. 5,43,750 ఎకరాలకు నీళ్ళివ్వాల్సిన దేవాదులలో ఇప్పటిదాకా ఐపి క్రియేటెడ్ 1,22,000 ఎకరాలు. దానిని వేగంగా మనం పూర్తిచేసుకోవాలంటే భూసేకరణ తొందరగా చేయాలి. గౌరవ సభ్యులు రాజేశ్వరరెడ్డిగారు కానీ, వెంకటేశ్వర్లుగారుకానీ ఆ ప్రాంతం నుంచి ఉన్నారు కనుక కొంచెం మీరు భూసేకరణలో మన జిల్లా కలెక్టర్లు, చిన్న జిల్లాలయినాయి. కొత్త జిల్లా కలెక్టర్లు చాలా ఉత్సాహంగా పనిచేస్తున్నారు. మీరు, గౌరవ శాసనసభ్యులందరూ కూడా ఇన్‌వాల్వ్ అయి వేగవంతంగా మీరు భూసేకరణ చేయగలిగినట్లయితే మనం అనుకున్న సమయానికి ఈ ప్రాజెక్టు పూర్తిచేసే అవకాశం ఉంటుంది. మీ అందరి సహకారం కూడా ఉండాలని కూడా నేను గౌరవ సభ్యులను కోరుతున్నాము. డిపార్టుమెంట్ పనిచేస్తుంది. ఈ మధ్యనే కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా AIBP (Accelerated Irrigation Benefit Programme), PMKSY (Pradhna Mantri Krishi Sinchai Yojana) లో దేవాదుల ప్రాజెక్టును ఇన్‌క్లూడ్ చేయించుకుని కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా దీనికి నిధులు విడుదల చేయించుకున్నాము. దాదాపు రూ.500కోట్లు ఈరోజు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేసుకున్నాం. నిధుల కొరతలేదు. నీటి లభ్యతకు ఇబ్బందిలేదు. కావాల్సిందంతా కొంచెం భూసేకరణే. ఎందుకంటే నీళ్ళు కూడా మనం 60 టి.ఎం.సిలకు పెంచుకున్నాం. గోదావరిలో బ్రహ్మాండంగా నీళ్ళున్నాయి. తుపాకులగూడెం దగ్గర బ్యారేజి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. నిధులు, నీళ్ళు రెండూ ఉన్నాయి. మనం తొందరగా భూసేకరణ చేయగలిగితే ప్రాజెక్టును అనుకున్నంత వేగంగా పూర్తిచేసి ముఖ్యంగా కరువు ప్రాంతాలైనటువంటి పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, జనగాము నియోజకవర్గాల్లో చాలా బాగా నీళ్ళు ఇచ్చుకునే అవకాశముంది. దీనికి గౌరవ సభ్యుల సహకారాన్ని కూడా నేను ఈ సందర్భంగా కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: సమయాభావం వల్ల మిగతా ప్రశ్నలు వాయిదా వేయడమైంది. నౌ జీరో అవర్. శ్రీమతి ఆకుల లలిత గారిని ప్రత్యేక అంశాన్ని ప్రస్తావించవలసిందిగా కోరుతున్నాను. మంత్రులు ఈ అంశాలను నోట్ చేసుకొని సంబంధిత మంత్రులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

## II. సభా కార్యక్రమం

### 1. ప్రత్యేక ప్రస్తావనలు

(A) శ్రీమతి ఆకుల లలిత: అధ్యక్షా, కరీంనగర్ జిల్లాలో నెలకొల్పబడిన 46 మోడల్ స్కూల్స్‌లో ఈ ఉద్యోగులు మూడు సంవత్సరాల నుం। పని చేస్తున్నారు. ఫిబ్రవరి 19, 2016 న జీ.ఓ. యం.యస్. నెం.14ను జారీ చేస్తూ జూన్, 2016 నుంచి పెంచిన జీతాలను ఇస్తామని చెప్పడం జరిగింది. జీ.ఓ.యం.యస్.నెం. 14 ప్రకారంగా కాకుండా ఇప్పుడు 20 శాతం మాత్రమే జీతాలు పెంచుతామని పత్రికా ప్రకటన చేయడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 19, 2016 న జారీ చేసిన జీ.ఓ. యం.యస్. నెం.14 క్రింద తెలంగాణాలోని 192 మోడల్ స్కూల్స్‌లో ఉద్యోగులు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్నారు. పెరిగిన జీతాలను జనవరి, 2016 నుంచి అరియర్స్‌తో కలిపి ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతున్నాము. దీని వల్ల 768 కుటుంబాలు ఆర్థికంగా బాగుపడతాయి. వాళ్లంతా కోరినట్లుగా జీ.ఓ.నెం. 14 ప్రకారం పెరిగిన వేతనాలు చెల్లించాలి. పెరిగిన జీతాలు జనవరి, 2016 నుంచి అమలు చేయాలి. మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. సి.యల్స్‌ని పెంచాలి. 12 నెలల కాలానికి జీతాలు పెంచాలి. తెలంగాణాలో మోడల్ స్కూల్స్‌లో పని చేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏజన్సీల నుంచి ఇపియఫ్, ఇయస్ఐ కార్డులు ఇప్పించాలని కోరుతున్నాం. చాలా సమస్యల్లో ఉన్నారు కాబట్టి ఈ మోడల్ స్కూల్స్‌లో పని చేసే అన్ని కేటగిరీల వారికి తప్పకుండా న్యాయం చేయాలని కోరుతున్నాను.

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యురాలు ప్రస్తావించిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. ఈ అంశాన్ని సంబంధిత మంత్రిగారికి తెలియజేయడం జరుగుతుంది.

మిస్టర్ ఛైర్మన్: శ్రీ పూల రవీందర్ గారు ప్రత్యేక అంశాన్ని ప్రస్తావించవలసిందిగా కోరుతున్నాను.

(B) శ్రీ పూల రవీందర్‌: (ఉపాధ్యాయ నియోజక వర్గం-వరంగల్, ఖమ్మం, నల్గొండ) అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో పిల్లల సంఖ్య తగ్గిపోవడంతో చాలా వరకు పాఠశాలను షైండప్ చేశారు. మూత వేయబడిన పాఠశాలల్లో, కళాశాలల్లో ఉన్నటువంటి ఉపాధ్యాయులు గానీ, అధ్యాపకులు గానీ పిల్లలు లేక, అడ్జస్ట్‌మెంటు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. అదే ఎయిడెడ్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకుల సంఖ్య లేదు. వీళ్లను శాశ్వతంగా ఆ కళాశాలల్లో, పాఠశాలల్లో అడ్జస్ట్ చేసే అవకాశం ఏమైనా ఉన్నదా లేక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో మెర్జ్ చేసే అవకాశం ఏమైనా ఉన్నదా? చెప్పాలని తమరి ద్వారా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

రెండో అంశం - 2008లో కొంత మంది కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ని, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో కొంత మంది టీచర్స్‌ని గెస్ట్ ఫ్యాకల్టీగా తీసుకున్నారు. వీళ్లంతా అవర్స్ బేసిస్‌లో అపాయింట్ అయిన వాళ్లు. 2008లో జీ.ఓ.నెం.241ని జారీ చేసి గంటకు రూ.100లు ఇచ్చేలా వీళ్లను అపాయింట్ చేశారు. అదే టైములో జీ.ఓ. నెం. 254ను జారీ చేస్తూ డిగ్రీ కాలేజీలలో, పి. జి. కాలేజీలలో లెక్చరర్స్‌ని గంటకు రూ.200లు ఇచ్చేలా అపాయింట్ చేశారు. తర్వాత జీ.ఓ. నెం. 60ని తీసుకొచ్చి పి.జి. కాలేజీలలో పని చేసే లెక్చరర్స్‌కి ఇచ్చే మొత్తాన్ని రూ.280కి పెంచారు. ఆ తర్వాత జీ.ఓ. నెం.157ని తీసుకొచ్చి రూ.380లు చేశారు. జీ.ఓ.నెం.447ను ద్వారా రూ.475 చేశారు. కానీ ఈ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కాలేజీలలో రూ.100లకు అపాయింట్ అయిన వాళ్లు గతంలో జారీ చేసిన జీ.ఓ.నెం. 241 ప్రకారం రూ.100లకే ఈరోజు వరకు పని చేస్తున్నారు. నెలకి రూ.7100లు వస్తుంది. కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి సాయంత్రం కళాశాల ముగిసేంత వరకు వీళ్లతో ఫుల్‌టైము పని చేయిస్తున్నారు ప్రిన్సిపాల్స్. వీళ్లకి తగు న్యాయం చేయవలసిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: సభ్యులు ప్రస్తావించిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధిత మంత్రి గారికి నివేదిస్తాం.

మిస్టర్ ఛైర్మన్: శ్రీ దామోదర్‌రెడ్డిగారు ప్రత్యేక అంశాన్ని ప్రస్తావించవలసిందిగా కోరుతున్నాను.

(C) శ్రీ కె.దామోదర్ రెడ్డి: (స్థానిక సంస్థలు - నల్గొండ) అధ్యక్షా, 2007-08 సంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లాలో గద్వాల్ నుంచి మాచర్లకి రైల్వే లైను సర్వే చేయడం జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైల్వే డిపార్టుమెంటుతో ఫిబ్రవరి 11, 2016 నాడు ప్రభుత్వం యంఓయు చేసుకోవడం జరిగింది. గద్వాల్ టు వనపర్తి, వనపర్తి టు నాగర్‌కర్నూల్, నాగర్‌కర్నూల్ టు కల్వకుర్తి, కల్వకుర్తి టు దేవరకొండ .. మూడు, నాలుగు నియోజకవర్గాలను కలుపుతూ మాచర్ల వరకు 250కిలోమీటర్లకు సంబంధించి రైల్వే లైను సర్వే చేసి రూ.920కోట్లతో యంఓయు చేసుకోవడం జరిగింది. మన ప్రభుత్వం 51శాతం, రైల్వే డిపార్టుమెంటు 49శాతం రేషియోలో యంఓయు చేసుకోవడం జరిగింది. రూ.920కోట్లు ఖర్చు పెడితే ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా వేయడం జరిగింది. ఒకే సంవత్సరం ఇంత మొత్తం బడ్జెటులో పెట్టడం సాధ్యం కాదు కాబట్టి ప్రతి సంవత్సరం రూ.200కోట్ల చొప్పున బడ్జెటులో కేటాయించి, నాలుగేళ్ల కాలంలో ఈ ప్రాజెక్టుని పూర్తి చేస్తే బాగుంటుంది. ఈ ప్రాంతం వెనకబడిన ప్రాంతం, ఈ ప్రాజెక్టు పూర్తయితే బాగుపడుతుంది. ఈ ప్రాంతంలో కర్నూలు టు హైదరాబాదు, హైదరాబాదు టు కర్నూలు లైను మాత్రమే ఉంది. గద్వాల్ - మాచర్ల లైను పూర్తయితే పెద్ద స్థాయిలో కన్క్టివిటీ వస్తుంది. ఆ ప్రాంతం వారి చిరకాల వాంఛ ఇది. తప్పకుండా వచ్చే బడ్జెటులో ఈ ప్రాజెక్టుకి కొంత మొత్తాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్న చాలా ముఖ్యమైనది. అలంపూర్, మాచర్ల, దేవరకొండ .. ఇదంతా చాలా వెనకబడిన ప్రాంతం. తప్పకుండా అక్కడ రైల్వే లైను రావాలి. ఈసారి బడ్జెటులో ఈ ప్రాజెక్టును ఇన్‌క్లూడ్ చేసేలా సంబంధిత మంత్రికి చెప్పి తప్పకుండా ప్రాధాన్యతనిచ్చి చేసేలా ప్రయత్నం చేస్తాం.

మిస్టర్ ఛైర్మన్: శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి గారు ప్రత్యేక అంశాన్ని ప్రస్తావించవలసిందిగా కోరుతున్నాను.

(D) శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, మన రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ రైతులకు సుమారుగా రూ.17వేల కోట్ల రుణాలను మాఫీ చేసింది. కానీ కరీంనగర్ జిల్లాలో సుమారు నాలుగు వందల మంది రైతులు ఈ రుణ మాఫీలో మిస్ అయినట్లుగా కలెక్టర్ గుర్తించి ఆ ప్రపోజల్‌ని డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌కి పంపించారు. వాళ్ల పేర్లు ఇంత వరకు నమోదు కాకపోవడం వల్ల వాళ్ల రుణాలు మాఫీ కావడం లేదు. ఆ రైతులందరూ ఆందోళనలో ఉన్నారు. కాబట్టి వ్యవసాయ శాఖా మంత్రిగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆ నాలుగు వందల మంది రైతులకు కూడా రుణ మాఫీ వర్తించేటట్లుగా చర్యలు తీసుకోవాలి. నాలుగు వందల మంది రైతులకు సంబంధించి కరీంనగర్ జిల్లా కలెక్టర్ నుంచి డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌కి ప్రపోజల్స్ వచ్చాయి. డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ లెక్కలు తీసి, దానికి అనుగుణంగా

రైతుల రుణాల మాఫీ చేయవలసిన బాధ్యత ఉంటుంది. ఆ రైతులంతా లక్ష రూపాయల లోపు రుణం ఉన్న వాళ్లే. కాబట్టి దాని మీద సత్వరమే చర్యలు తీసుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు సుధాకర్‌రెడ్డిగారు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. వ్యవసాయశాఖామంత్రి గారికి చెప్పి ఆ రైతులకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తాం.

## 2. వాయిదా ప్రతిపాదన :

మిస్టర్ ఛైర్మన్: శ్రీ మహ్మద్ అలీ షబ్బీర్ మరియు ఇతరులు .. 2015 సంవత్సరం మార్చిలో 43శాతం ఫిట్‌మెంటును ప్రకటించి, 2014 సంవత్సరం జూన్ నుంచి అమలు చేయుటకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అయినప్పటికీ సుమారు నాలుగు లక్షల మంది ఉద్యోగులు మరియు పెన్షనర్లు రూ.3400కోట్ల పిఆర్‌సి బకాయిల కొరకు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. ఆ బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైన అంశాన్ని చర్చించాలని ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైంది.

MR. CHAIRMAN: Item No.III - All the papers are deemed to have been laid on the Table:

## III. PAPERS LAID ON THE TABLE

A copy in each of the Annual Accounts of Hyderabad Metro Rail Limited (HMR) for the Financial Years 2010-11, 2011-12 and 2012-13 as required under Ssection 619 (A)of the Companies Act, 1956.

MR. CHAIRMAN: Now, the House is adjourned for Tea-break for 15 minutes.

(The House then adjourned at 11.41 a.m. for 15 minutes' Tea-break)

12.20 మ.

(THE HOUSE REASSEMBLED AT 12.33 P.M.)

(HON'BLE CHAIRMAN IN THE CHAIR)

MR. CHAIRMAN: There is an announcement to be made.

"I am to announce to the House that Lunch has been arranged for all the Hon'ble Members in the Dining Hall of Jubilee Hall to be followed by Awareness Programme on 'Cashless Transactions' to be conducted by the State Bank of Hyderabad at 2.00 p.m. today in Darbar Hall, Council building. All the Members are requested to participate in the Lunch and in the Awareness Programme also. The Press is also invited for the lunch."

MR. CHAIRMAN: Now, Item No. III of the Agenda - Short Discussion on "Development of Fisheries in the State".

రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధిపై లఘు చర్చకు సంబంధించి గౌరవ మంత్రివర్యులు శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి గారిని ఈ విషయమై ముఖ్య ఉద్దేశాలను వివరించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

## IV. లఘు చర్చ
## మత్స్య పరిశ్రమ అభివృద్ధి

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి : అధ్యక్షా, పశు సంవర్ధక, మత్స్య పరిశ్రమ, పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ, సినిమాటోగ్రఫీ మంత్రి వర్యుల తరఫున శాసన పరిషత్తులో మత్స్య రంగ అభివృద్ధి సంక్షిప్త చర్చపై సమాచారాన్ని అందించడానికి అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాలకు, కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారికి ప్రధానంగా మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపి వారిని సామాజికంగా, ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకురావాలన్న దృఢ సంకల్పంతో మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు ప్రత్యేక ఆలోచన మరియు శ్రద్ధతో మత్స్యకార వృత్తిలో జీవిస్తున్న కుటుంబాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు రచించి అమలు చేస్తున్నది.

మత్స్య శాఖ యొక్క ప్రధాన నిధులు అన్ని నీటి వనరుల నుండి అనగా, జలాశయాలు, చెరువులు, కల్చర్ చెరువులు ఉత్పత్తి సామర్థ్యం మేరకు నూతన శాస్త్రీయ పద్ధతులను అవలంభించి చేపల దిగుబడి పెంచడం మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరచడం చేప పిల్లలను ఉత్పత్తి చేసి సహకార సంఘాలకు తక్కువ ధరకు అమ్మడం. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు అమ్మడం. అసలైన మత్స్యకారులకు చెరువులను తక్కువ ధరకు కౌలుకు ఇవ్వడం. మత్స్యకారులకు సంక్షేమ పథకాలు అమలు చేయడం మొదలగునవి.

అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మత్స్య శాఖకు ఎన్నడూ లేని విధంగా రూ.101కోట్లను బడ్జెట్‌లో కేటాయించి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టడం

జరుగుతున్నది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూడా కొన్ని కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నాము. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని సింహభాగం జలాశయాల పూడికతీత కార్యక్రమాల వలన మరియు సమృద్ధిగా కురిసిన వర్షాల వలన అన్ని జలాశయాలు, కుంటలు మరియు చెరువులు జలకళను సంతరించుకొని నీలి విప్లవానికి ఆహ్వానం పలికిన సందర్భంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో అనేక బృహత్తర పథకాలను ప్రారంభించాం. తెలంగాణ రాష్ట్రంలో 74 జలాశయాలు, 4,324 మత్స్య శాఖ చెరువులు మరియు 19,746 గ్రామ పంచాయితీ చెరువులు, నీటి వనరులు మొత్తం 5,62,814 హెక్టార్ల విస్తీర్ణంలో కలవు. ఈ రంగం ద్వారా 3,26,154 మత్స్యకారులకు ప్రత్యక్ష ఉపాధి మరియు సుమారు ఒక లక్ష కుటుంబాలకు పరోక్ష ఉపాధి లభిస్తుంది.

2015-16 సంవత్సరంలో రూ.1,185కోట్ల విలువ గల రెండు లక్షల ముప్పయి ఏడు టన్నుల చేపలు, రొయ్యలు ఉత్పత్తి చేయడం జరిగింది. జీఎస్‌డిపిలో ఇది 0.61శాతం. రాష్ట్రంలో 3,977 మంది మత్స్యకారుల, మహిళా సహకార సంఘాలు 3,26,154 మంది సభ్యులతో రిజిస్టర్ కాబడి ఉన్నాయి. మత్స్యకారులు ముఖ్యంగా చేపల ఉత్పత్తి, మార్కెటింగు, ప్రాసెసింగ్, విలువ ఆదనపులలో పని చేస్తుంటారు. ఎక్కువమంది సభ్యులు సాంప్రదాయ, మత్స్యకారుల కులాల నుండి అనగా, ముదిరాజ్ మరియు గంగపుత్ర కులాలకు చెందినవారు. ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనులు మరియు సాంప్రదాయ మత్స్యకారులు లేని గ్రామాలలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు మరియు ఇతర వెనుకబడిన కులాల వారు ఈ ఉత్పత్తిపై జీవనోపాధి పొందుతున్నారు.

అధ్యక్షా, ప్రభుత్వం పెద్దఎత్తున అర్హులైన మత్స్యకారులందరినీ ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలలో సభ్యులుగా చేర్పించుటకు మరియు నూతన సంఘాలు ఏర్పాటు చేయుటకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది. మరియు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఎక్కువ కుటుంబాలకు చేరే విధంగా ఈ చర్యలను చేపట్టడం జరుగుతుంది.

ఈ పథకాలు మత్స్యకారుల అభివృద్ధి కోసం 2016-17 సంవత్సరానికి అమలు చేస్తున్నాము.

1. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల ఆధునీకీకరణ అటువంటివి 12 ఉన్నాయి. వాటికి రూ.29కోట్లు.

2. ఉచిత చేప పిల్లల పంపిణీ 4,695 జలాశాయాల్లో వేయడానికి రూ.48.35లక్షలు అవసరం.

3. 50 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.4.50లక్షలు అవసరం.

4. పొదుగు మరియు పరిహారం చేపల వేట నిషిద్ధ మాసాలలో 1500మందికి రూ.27లక్షలు.

5. జలాశయాల్లో చేపలు పట్టు మత్స్యకారులకు పడవలు మరియు వలల పంపిణీ సంఖ్య 733 వీటికి రూ.36.67లక్షలు.

6. మార్కెటింగ్‌కి మోపెడ్‌లపై చేపల పెంపకం 100యూనిట్లు, రూ.30.00లక్షలు.

7. లగేజీ ఆటోలపై చేపల అమ్మకం - 30, రూ.90లక్షలు.

8. కేజ్ కల్చర్ - 100కేజ్ కల్చర్లకి రూ.8.24లక్షలు

9. చేపల మార్కెట్ నిర్మాణానికి - దాదాపు 45కి రూ.4.05లక్షలు.

10. రాష్ట్ర ప్రణాళిక నిధులకి ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నుండి రూ.14.65లక్షలు రాష్ట్రానికి నీలి విప్లవం క్రింద ప్రధాన జలాశయాల వద్ద ల్యాండింగ్ కేంద్రాల నిర్మాణం. రైతులకి చేపల పెంపకానికి చెరువులు నిర్మించుకొనుటకు రాయితీలు, ఔత్సాహికులు, చేప పిల్లల హేచరీలు మరియు ఉత్పత్తి కేంద్రాలు మరియు దాణా ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాట్లు చేసుకొనుటకు 80యూనిట్ల కేజీ కల్చర్ రాయితీలకు ఈ నిధులు ఉపయోగిస్తాము.

**12.40 మ.** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొన్ని కార్యక్రమాలను నూతనంగా పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది. చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి 2013-2014 సంవత్సరం ఉమ్మడి రాష్ట్రంలో ఒక కోటి రూపాయలు కేటాయిస్తే, తెలంగాణ ప్రభుత్వం రూ.48.35 కోట్లను కేటాయించడం జరిగింది. అలాగే సబ్సిడీని 50 శాతం నుండి 100 శాతానికి పెంచడం జరిగింది. 7,180 మత్స్య కార్మికులకు రూ.10,000 యూనిట్ విలువతో 50 శాతం సబ్సిడీతో వలలు మరియు తెప్పలు ఇవ్వడం జరిగింది.

మత్స్య కార్మికుల గౌరవాన్ని పెంచేందుకు రూ.10.00 లక్షల యూనిట్ విలువతో 90 శాతం సబ్సిడీతో 409 కమ్యూనిటీ హాళ్ల నిర్మించుటకు నిధులు మంజూరు చేయడం జరిగింది. 4,271 మత్స్య కార్మికులకు చేపల వేట నిషిద్ధ (జూలై, ఆగష్టు) మాసాలలో ఒక్కొక్కరికి రూ.1,800/- చొప్పున పరిహారం క్రింద ఇవ్వబడుతోంది. ఐదు జలాశయాలలో ప్రయోగాత్మకంగా కేజ్ కల్చర్‌ను చేపట్టడం జరిగింది. ఈ సంవత్సరం 80 యూనిట్లను 800 మత్స్య కార్మికుల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కలిగే విధంగా ప్రణాళిక సిద్ధం చేయబడింది.

ఇప్పటి వరకు 33 రిటైల్ చేపల మార్కెట్‌లు, రాష్ట్రీయ కృషి వికాస యోజన, జాతీయ మత్స్య వృద్ధి సంస్థ వ్యవసాయ మార్కెట్ నిధుల నుండి నిర్మించడం జరిగింది. ఈ సంవత్సరం సుమారు వంద చేపల మార్కెట్లను రూ.7,50,000 యూనిట్ విలువతో డిమాండు ఉన్న ప్రదేశాలలో నిర్మించుటకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. గౌరవ శాసనమండలి సభ్యులు అనువైన స్థలాలు చూపించిన యెడల నిధులు మంజూరు చేయుటకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. అలాగే జిల్లా కలెక్టర్లను అనువైన స్థలాలను కేటాయించవలసిందిగా కోరడం జరిగింది.

సంచార చేపల విక్రయాలను ప్రోత్సహించేందుకు మన ప్రభుత్వం మత్స్య కార్మికులకు రూ.4.00 లక్షల యూనిట్ విలువతో 265 లగేజ్ ఆటోలను మరియు రూ.40,000/-లతో 518 మోపెడ్లను 75 శాతం సబ్సిడీతో మత్స్య అభివృద్ధి పథకం క్రింద ఇవ్వడం జరిగింది. ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలలో అతి ముఖ్యమైనది ఉచిత చేప పిల్లల కార్యక్రమం. వీటి ప్రధాన ఉద్దేశ్యాలు నిరుపేదలైన మత్స్య కార్మికులపై ఆర్థికభారం తగ్గించుట, చేప దిగుబడి పూర్తి స్థాయిలో సాధించుట, మధ్య దళారుల ప్రమేయం లేకుండా మత్స్య కార్మికుల సామర్థ్యాన్ని పెంచి చేపల విక్రయాలను వారే చూసుకోవడం.

ఈ సంవత్సరం 3,939 జలాశయాలు మరియు చెరువులలో రూ.24.00 కోట్లు వెచ్చించి 29 కోట్ల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసి రెండు లక్షల నలభై వేల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కలిగే విధంగా పూర్తి చేయడం జరిగింది. దీనివలన 82,000 టన్నుల ఉత్పత్తి రాగలదని వాటి విలువ రూ.400.00 కోట్లకు పైన ఉంటుందని అంచనా వేయడం జరిగింది. 2017-18 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని జలాశయాలు మత్స్య శాఖ మరియు గ్రామ పంచాయితీ ఆధీనంలో ఉన్నటువంటి అన్ని చెరువులలో నలభై కోట్ల ముప్పై తొమ్మిది లక్షల చేప పిల్లలు వేయడం కోసం రూ.36.35 కోట్లు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రం మత్స్య కార్మికుల ఫెడరేషన్ ద్వారా జంట నగరాలలో పదకొండు చేపల విక్రయ కేంద్రాలకు నగదు రహిత లావాదేవీలతో నడిపిస్తున్నాం. ఈ ఫెడరేషన్ ఆర్థిక పరిపుష్టి కొరకు ఈ సంవత్సరం రూ.25.00 లక్షలు కేటాయించాము. గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో బంగారు తెలంగాణ రూపుదిద్దుకోవడానికి వెనుకబడి ఉన్న చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను సామాజికంగా, ఆర్థికంగా బలపరచడం ఎంతో అవసరం. ఈ దిశగా మా శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని చెబుతూ, తమరి ద్వారా వారికి తెలియజేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి: అధ్యక్షా, మత్స్య పరిశ్రమ గురించి మాట్లాడేందుకు అవకాశమిచ్చిన తమరికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. గౌరవ మంత్రిగారు చదివిన స్టేట్‌మెంట్‌లో మాకు సర్క్యులేట్ అయిన స్టేట్‌మెంట్‌లో ఫిగర్సు, ఫ్యాక్ట్స్‌లో తేడాలున్నాయి. వారు చదివిన స్టేట్‌మెంట్ మాకు ఇచ్చినట్లయితే బాగుండేది. ఏదేమైనా వారు అనేక విషయాలను మీ ద్వారా సభ దృష్టికి తీసుకొచ్చారు. మత్స్య పరిశ్రమ చాలా ముఖ్యమైనది. గత ప్రభుత్వం ఏమి చేసిందనేది పక్కన పెట్టి ప్రజల యొక్క నైపుణ్యం, ఆరోగ్యం పెరిగే విధంగా అన్ని రకాలుగా ఈ ఫ్యాక్ట్స్ ఉంటే మేము తప్పనిసరిగా ఆహ్వానించేవాళ్లం.

నేను తమరి ద్వారా మనవి చేసేది, వారు ఇచ్చిన ఫిగర్సులో కేంద్రప్రభుత్వ సంస్థలు, బ్లూ రెవల్యూషన్ క్రింద ఇచ్చినటువంటి నిధులు, రాష్ట్రీయ కృషివికాస్ యోజన అలాగే తెలంగాణ ప్రభుత్వం దానికొరకు ఎటువంటి కార్యక్రమాలు తీసుకుంటుందని వివరించారు. ఇన్ని కోట్ల ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారు. ఇంత పెద్ద కార్యక్రమం జరుగుతున్నప్పుడు ఇన్ని చేప పిల్లలను వేశామని చెబుతున్నారు. దాంట్లో స్పెసిఫిక్‌గా దానిని కౌంటు చేసే మెకానిజం ఏముంది? ఎన్ని చేప పిల్లలను చెరువులలో వేశారు? దాని బేసిక్ యూనిట్లను ఎవరు లెక్కిస్తున్నారు?

చాలా వరకు గంగపుత్ర, ముదిరాజ్‌కు సంబంధించి చేపలు పట్టే కులాలకు చెందినవారు సభ్యులుగా ఉంటారు. ఏజెన్సీ ప్రాంతంలో షెడ్యూల్డు తెగల, కులాల నుండి కూడా సభ్యులుగా ఉంటారు. సాంప్రదాయకంగా చేపలు పట్టే కులాలకు చెందిన వ్యక్తులు లేనప్పుడు గ్రామాలలో షెడ్యూల్డు కులాలు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందినవారు ఉంటారు. ఎలిజిబిలిటీ క్రైటేరియా సొసైటీలను ఏర్పాటు చేసేటప్పుడు గాని, ఆ సొసైటీలకు రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు గాని ఎవరెవరు మెంబర్లు ఉన్నారు? ఒకవేళ బోగస్ మెంబర్లు ఉంటే వారిని ఏరివేసే విధంగా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? కేంద్ర ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వం గాని ఇంత సబ్సిడీ ఇస్తున్నప్పుడు మీరు తీసుకుంటున్నటువంటి చర్యల గురించి చెబితే బాగుంటుందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

గత ప్రభుత్వ హయాంలో కూడా ఈ సొసైటీలకు వలలు, మోటార్ సైకిళ్లు, తెప్పలు, డీజిల్ సబ్సిడీ కోటాలో బోటులు ఇవ్వడం జరిగింది. ఇప్పుడున్నటువంటి పరిస్థితులలో క్యాష్‌లెస్ ట్రాన్జాక్షన్స్ ఉంటే బాగుంటుందని అన్నారు. వాళ్లకు అవగాహన వచ్చే వరకు ఇలాంటి చిన్న చిన్న పరిశ్రమలకు క్యాష్‌తో ఉన్న ట్రాన్జాక్షన్స్ అయితేనే బాగుంటుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

కేటాయించిన బడ్జెట్‌కు అదనంగా నిధులు ఇచ్చినట్లయితే ఖచ్చితంగా మేము స్వాగతిస్తాము. కాకపోతే బోగస్‌ల ఏరివేత, మధ్య దళారుల ప్రమేయం లేకుండా చేయడం, గ్రామస్థాయిలో ఉన్నటువంటి సొసైటీల వ్యవస్థ వీటన్నింటి మీద జిల్లా కలెక్టర్లకు ఫ్రీక్వెంట్ మెగా ప్లాన్ ఇచ్చినట్లయితే బాగుంటుంది. ప్రజలు ఎక్కువగా తినే చేపలను పెంచినట్లయితే వాటికి మంచి డిమాండ్ ఉంటుంది.

అదేవిధంగా మార్కెట్‌లో ఉన్న చేపలను స్టోర్ చేసినప్పుడు, ఎక్స్‌పోర్ట్ చేసేటప్పుడు చెడిపోకుండా ప్రభుత్వం ఏసిలను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. మత్స్య శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖలు ఇరిగేషన్ మీద ముడిపడి ఉన్నాయి. కాబట్టి ఒక టాస్క్‌ఫోర్స్‌ను పెట్టి, జిల్లాకి ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి విజిలెంట్ మెకానిజం, ఫ్రీక్వెంట్ మెకానిజం, కంట్రోలింగ్ మెకానిజం, మానిటరింగ్ మెకానిజం ఉన్నట్లయితే వారికి ఉపాధి కల్పించిన వారమౌతాము.

అలాగే వర్షాకాలంలో మత్స్య కార్మికులు చేపలు పట్టడానికి వెళ్లినప్పుడు వారికి ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా immediate rescue teams, అలాగే disaster management వారితో కూడా tie up అయి తగిన చర్యలు తీసుకొని, వారికి బీమా పథకాలు ఇవ్వడం లాంటి అంశాలను అందులో పొందుపరిస్తే బాగుంటుంది. అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాలలో దొంగతనంగా చేపలు పట్టే బోగస్ వ్యక్తుల మీద అనేక కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటి అవకాశం ఇవ్వకుండా ముందే ఎడ్యుకేట్ చేసి, ఎవరు అర్హులో, ఎవరు అనర్హులో చూసి తీసేసే కార్యక్రమం చేసినట్లయితే బాగుంటుందని చెబుతూ, మీరు ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

డా. యం. శ్రీనివాస్ రెడ్డి : (నామినేటెడ్) అధ్యక్షా, ఈ అంశం గురించి మాట్లాడేందుకు అవకాశమిచ్చిన తమరికి ధన్యవాదాలు. చేపల పెంపకం గురించి మాట్లాడేముందు పెద్ద ప్రాజెక్టు అయిన మిషన్ కాకతీయ గురించి మాట్లాడితే బాగుంటుంది. 1957వ సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రం కాకముందు మనకు 75,000 చెరువులు ఉండేవి. 2014 సంవత్సరంలో 45,000 చెరువులకు కుదించబడ్డాయి. గత ప్రభుత్వాలు చెరువుల మీద శ్రద్ధ చూపకపోవడం వలన గ్రామాలనుండి దాదాపు 30,000 చెరువులు మాయమైనాయి.దాని వలన వ్యవసాయం పూర్తిగా దెబ్బతిని, వ్యవసాయం మీద ఆధారపడిన వారి కుటుంబాలు జీవనోపాధిని కోల్పోవడం, పట్టణాలకు వలసపోవడం జరిగింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ మూలంగా చేపల పెంపకానికి అనుకూలంగా మారినది.

ఏదేమైనా గాని, తెలంగాణ ప్రభుత్వం ఇటువంటి కులవృత్తుల వారికి సహకారమందించి, అభివృద్ధి చేసి, మంచి జీవనోపాధిని కల్పించాలనే ఉద్దేశ్యంతో చేపల పెంపకాన్ని చేపట్టడం జరిగింది. సాధారణంగా మనం తినే అన్నంలో “30 percent of the protein should come from the animal source” అంటారు. అంటే ఆ ప్రొటీన్ పాల ద్వారా, గుడ్డు ద్వారా, మాంసం ద్వారా, చేప ద్వారా రావాలి. దేశం మొత్తంలో చూసినట్లయితే మన రాష్ట్రం గొర్రెల పెంపకంలో మొదటి స్థానం, గుడ్ల ఉత్పత్తిలో మూడవ స్థానం, కోళ్ల పరిశ్రమలో ఐదవ స్థానంలో ఉన్నది. చేపల పెంపకం దేశంలో ఏ స్థానంలో ఉన్నదో తెలియదు అంటే చాలా వెనుకబడి ఉన్నది. అందువల్ల మన తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో దీనిని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్నందుకు చాలా సంతోషం.

సాధారణంగా చేపలు రెండు రకాలు ఒకటి – sea fish, రెండు – fresh water fish. సముద్రంలో దొరికే చేపలను తీర ప్రాంతాలలో ఉన్న గ్రామాలకు, పట్టణాలకు పంపిణీ చేయడం వల్ల వారికి జీవనోపాధి లభిస్తుంది. వారు సంవత్సరం పొడుగునా సముద్రంలోకి వెళ్లి చేపలు పట్టి వాటిని మార్కెట్‌లో అమ్ముతుంటారు. ఈ మధ్యన వచ్చిన research findings ప్రకారం సముద్రంలో చేపలు తక్కువగా దొరుకుతున్నాయని, అందుకు కారణం కొన్ని దశాబ్దాల నుండి సముద్రంలో ఉన్న చేపలను పట్టడమే తప్ప, వాటిని పెంచాలనే ఉద్దేశం ఎవరికీ లేకపోవడం వల్ల. మన తెలంగాణ రాష్ట్రానికి సముద్ర తీర ప్రాంతం లేకపోవడం వలన మనం కేవలం ఫ్రెష్‌వాటర్ చేపల పైనే ఆధారపడాల్సి వస్తోంది.

ఈనాడు తెలంగాణ ప్రభుత్వం చెరువులను, కుంటలను పునరుద్ధరించడం, తొందరగా పెరిగే చేపలు ఉండడం, చేపలకు మంచి ధర రావడం ద్వారా చేపల ఉత్పత్తిని ప్రోత్సహించడం జరుగుతోంది. వ్యవసాయ క్షేత్రంలో కూడా డెయిరీ ఫార్మ్ గాని, చేపల పెంపకం గాని, కోళ్ల పెంపకం గాని అభివృద్ధి చేయవచ్చు. చేపలకు నీరు ఉండి ఫీడ్ వేయడం వలన ఫిష్‌ఫార్మింగ్‌లో చాలా లాభాలుంటాయి. ఏమైనా చెరువులు, కుంటల్లో నీళ్లు ఉంటే చాలు వాటిని అభివృద్ధి చేయవచ్చు.

అలాగే మత్స్య కార్మికులకు బ్యాంకు లోన్లు కూడా ఇప్పించినట్లయితే బీద కులవృత్తుల వారిని ప్రోత్సహించినట్లవుతుంది. మన తెలంగాణ రాష్ట్రంలో కొర్రమట్టలు, చందమామలు, జెల్లలు, పరకలు, రొయ్యలు ఉన్నా ఎక్కువ మంది కొర్రమట్ట చేపలకే ప్రాధాన్యం ఇస్తారు. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో చాలా మంది కొర్రమట్ట చేపలు తినడానికే ఎక్కువగా ఇష్టపడతారు. ప్రతి మనిషి ఎటువంటి ఆహారం తీసుకున్నా, త్రాగినా, రుచికరమైన వాటికే

ముక్కున చూపుతాడు. చేపల విషయంలో కొర్రమట్టలు రుచికరంగా ఉంటాయి. కాబట్టి వీటిని ఎంత పెంపొందిస్తే అంత మనకు లాభం చేకూరుతుంది. ఉదాహరణకు పాలు, టీ చూసినట్లయితే పాలు ఎంత ఆరోగ్యకరమైనా, ఎక్కువ మంది "టీ"కే ప్రాముఖ్యత ఇస్తారు. ఎందుకంటే పాల కంటే, టీ రుచికరంగా ఉంటుంది. నేను చెప్పేదేమిటంటే, ఉన్న మాంసాహారాలలో చేపలు రుచికరమైనవి కాబట్టి ఖచ్చితంగా వీటికే ప్రాముఖ్యత ఇస్తారు, చేపలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు.

1.00 మ. మన ఆహారపు అలవాట్లు అన్నీ కూడా ఆ ప్రాంతాలలో దొరికే ఆహారాలను బట్టి మారుతూ ఉంటాయి. మనం జొన్నలు, వరి ఎక్కువగా తినడానికి కారణం మన ప్రాంతంలో ఇవి ఎక్కువగా పండుతాయి. వెస్ట్ బెంగాల్‌లో చేపలను చాలామంది శాఖాహారముగా భావిస్తారు. దానిని జలపుష్పం అనటం, వాటిని తినటం జరుగుతుంది. "Depending on the food habits it can be treated as a vegetarian or non-vegetarian". తెలంగాణలో ఇంకొకటి అభివృద్ధి చెందినవి రొయ్యలు. ఇవి చాలా మంచివి. వీటిలో పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. చేపల పెంపకం "Pro-biotic" అనేది ఎక్కువ వాడకం జరుగుతుంది. Pro-biotic either it is living organism or a chemical, it can be used for the production of shrimp. ఇవి వాడటం వలన రొయ్యలు ఆహారం తక్కువగా తింటాయి. Conversion of feed into fish meat and survivability is more, growth rate is more and and feed cost is less. కాబట్టి వీటిని ఉపయోగించాలి. చేపల పెంపకం దార్లకు వలలు (నెట్స్), దాణా(ఫీడ్) మరియు చేప పిల్లలను(సీడ్)ను తక్కువ ధరకు అందజేయాలి. అప్పుడు చేపల పెంపకం బాగా పెరగడానికి అవకాశం ఉంటుంది. నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే Pro-biotic దృష్టి పెట్టి, అభివృద్ధి చేయాలి.

మత్స్యకారులలో చాలా మంది పేదవారే ఉన్నారు. వీరికి హౌసింగ్ స్కీమ్స్, బీమా పథకాలు పెట్టాలని కోరుకుంటున్నాను. ఈ వృత్తిలో ఉండేవారికి శిక్షణ ఇస్తే లాభదాయకంగా ఉంటుందని తెలియజేస్తున్నాను. వారికి వలలు, చేప పిల్లలు, చేపల ఆహారం అందించాలి. వారికి ఐస్ బాక్స్‌లు మొదలగు వాటిని సబ్సిడీ రేట్లకు అందించాలి. కేజ్‌కల్చర్ చాలా ముఖ్యమైనది. ఇతర దేశాలలో కూడా దీనిని బాగా వృద్ధి చేస్తున్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

SRI SYED ALTAF HYDER RAZVI: (Assembly Constituency) Thank you, Chairman Sir for giving me the opportunity to speak on Short Discussion on "Development of Fisheries in the State of Telangana". Sir, according to the note which has been provided to us by the Government, it is really thought provoking to note that the Government of Telangana is looking at all the provisions and all kinds of means of livelihood for various communities and they are encouraging it. We congratulate the Government for this initiative. Our State, being the State where we can only think of fresh water fisheries i.e. we are not connected to any coast like our Hon'ble Member has said in his speech. I do not want to go into the details and in-depth things.

Sir, as far as the figures given to us, it is seen that in the year 2015-16, there is about 2.37 lakhs tonnes of produce, which is mentioned in the nett amounting Rs.1185 Crores, forming GSDP of 0.61%. I think, there is lot of scope to focus this area. There are about 3.20 lakhs families dependent on this profession and I think the Government can do much more to encourage this profession. It has been mentioned in the flagship programme of Government 'Mission Kakatiya' where thousands of lakes have been developed besides ponds and reservoirs. Similarly, now the areas where I see problem is, where there are many lakes which are connected to populations mainly in villages, towns and cities, especially in and around Hyderabad, there is lot of industrial waste and sewerage which has been connected to these lakes

fishermen also as well as having enough supplies to the cities also. تو اس میں ان سو
جگہوں پر آپ fish markets کو develop کرنے کی بات کر رہے ہیں، اس کا بھی میں خیر مقدم کرتا ہوں، اور ساتھ میں میں کہنا
چاہتا ہوں کہ حیدرآباد میں ایک تاریخ رہی، خاص طور پر میری جو constituency adopted ہے جہاں پر میں اپنے
funds استعمال کرتا ہوں، of course تو نئی ریڈی صاحب بولیں گے کہ مشیرآباد میں بہت بڑی fish market ہے، biggest
fish market is in Musheerabad, and the second is in Begum Bazar where I
have adopted that constituency. تو بیگم بازار کی جو fish market ہے، it is one of the oldest,

we used to go there when we were small kids. اس کا کوئی development نہیں کیا گیا۔ آپ نے
تو بنایئے، میں یہ نہیں کہہ رہا ہوں کہ آپ نئے مت بنایئے۔ بنایئے۔ لیکن جو پرانے ہیں ان کو develop کیجئے، وہاں پر زیادہ سے زیادہ
facilities لایئے، اور وہاں پر جو کاروبار کرتے ہیں، ان کو وہاں پر processing کرنے کے لئے، they should have
a proper place تا کہ گندگی نہ ہو، unhygenic conditions بہت زیادہ ہیں، آپ fish market اگر دیکھیں
گے، جہاں کہیں بھی ہو، there will be a lot of unhygenic conditions. تو اگر آپ اس میں کچھ
allocation کریں گے، to improve the existing old fish markets like in Musheerabad,
like in Begum Bazar, تو حکومت کی طرف سے یہ ایک اچھا positive کام رہے گا۔ اور اس سے ہٹ کر آپ لوگوں نے
mobile شروع کرنے کی جو بات کی ہے، provide more chilling units جہاں پر آپ store کر سکتے ہیں۔ ایک دن
اگر پورا produce نہیں بکے گا تو دوسرے دن اس کو رکھنے کی کوئی ایسی facility دیجئے مارکٹ میں تا کہ all those people
who are selling the fish, جہاں سے بیچتے ان کو store کرنے کا موقع ملے so that it does not get
spoiled. تو on the whole میں کہوں گا کہ آپ نے ایک اچھا initiative لیا ہے، ایک ایسے profession کو آپ یہاں
پر encourage کر رہے ہیں، basically, these kinds of professions we find existing in the
coastal areas, تو آپ یہاں تلنگانہ کے اندر کر رہے ہیں، بہت اچھی بات ہے، اور lakes کے protection کے لئے آپ
کچھ کیجئے۔ Lakes کو اگر ہم protect نہیں کریں گے تو we cannot imagine of having fisheries
develop in such areas. جہاں تک ہو سکتا ہے آپ contamination کو روکئے، because now the
kind of fish we get, it it is from contaminated water. Instead of giving a better
health, اس میں ہم کو نئی نئی بیماریاں ہو سکتی ہیں۔ منسٹر صاحب expert ہیں، کافی چیزوں کے بارے میں انہوں نے بتایا، I really
appreciate. He has really enlightened the House with his experience. تو صاحب، اس
میں ہم کو ضرورت ہے کہ ہم ایسی جگہ پر fisheries کرنے کو encourage کریں، where you get clean water

صاف ستھرا اچھا پانی ہو جس میں یہ ساری چیزیں ہو سکیں۔ بہر حال میں حکومت کو مبارکباد دیتا ہوں کہ اس نے ایک initiative لیا ہے۔
We hope that more allocations would be made in developing the fish markets in the entire State of Telangana. I thank you very much for giving me this opportunity. Thank you Sir.

శ్రీ ఎన్. రామచంద్ర రావుః అధ్యక్షా, మత్స్య పరిశ్రమ మీద మాట్లాడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. లేక్స్‌తోపాటు, గోదావరి, కృష్ణానదీ జలాలలో కూడా చేపల పెంపకానికి ఏమైనా ఆలోచనలు ఉన్నాయా? రజ్వీగారు అన్నట్లు సిటీ లేక్స్‌లో కాలుష్యం ఉంటుందని తెలిపారు. ట్యాంక్ బండ్ దగ్గర కొన్ని ప్లాంట్లు పెట్టారు, ఆ ప్లాంట్లను కొన్ని లేక్స్‌లో పెడితే బాగుంటుంది. చేపలకు కావలసిన ఆహారాన్ని ఇతర దేశాల నుండి తెచ్చుకోకుండా మన దగ్గరే తయారు చేస్తే బాగుంటుంది. National Egg Co-ordination Committee (NECC) వారు egg తినడం వలన లాభాలు ఉన్నాయని టీవీలో ప్రకటనను ఇస్తున్న విధంగా చేప తినడం వలన ఆరోగ్యానికి మంచిదని ప్రకటనలు ఇస్తే బాగుంటుంది. అదే విధంగా ఐస్ బాక్స్‌లను కూడా ప్రభుత్వం తరఫున సరఫరా చేస్తే బాగుంటుంది. వ్యాపార పరంగా కాకుండా వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా వీటిని అభివృద్ధి చేయాలి.

కేంద్ర ప్రభుత్వం కొన్ని పథకాలను రూపొందించి అమలు చేస్తున్నది. FFDA ద్వారా కేంద్రం నుండి 80 శాతం, రాష్ట్రం నుండి 20 శాతం సబ్సిడీ లభిస్తున్నది. Fishermen Welfare group Accident Program మరియు Fishermen Housing Schemeకి కేంద్రం నుండి 50 శాతం, రాష్ట్రం నుండి 50 శాతం సబ్సిడీ లభిస్తున్నది. Development of Inland Fresh Water Aqua Cultureకి కేంద్రం నుండి 75 శాతం, రాష్ట్రం నుండి 25 శాతం సబ్సిడీ లభిస్తున్నది. fisheries Training Centre, National Schemes for Fisherman, Development of Fishermen Villages మొదలైన పథకాలున్నాయి. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకి కలిపి మరికొన్ని పథకాలున్నాయి. ఈవృత్తిలో ఉండే వారి మీద కొన్ని వివాదాలున్నాయి. బోగస్ మెంబర్స్‌తోపాటు, కొన్ని సంఘాల మీద కూడా వివాదాలున్నాయి. ఆ వివాదాలను పరిష్కరిస్తే దాని మీద ఆధార పడ్డ కుటుంబాలు చాలా బాగుపడతాయి. చేపల మరియు రొయ్యల ఉత్పత్తి 3.21 టన్నులను లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటి వరకు 1.7 టన్నులు మాత్రమే ఉత్పత్తి జరిగింది. ఆర్టిఫిషియల్‌గా చెరువులను ఏర్పాటు చేసి దానిలో చేపల పెంపకం యొక్క కార్యక్రమాలను చేపట్టాలి. అదే విధంగా కొన్ని గ్రామాలలో చేపల పెంపకాన్ని కాకతీయ మిషన్‌కు లింక్ చేయడం జరిగింది. మత్స్యకారుల పరిశ్రమ అభివృద్ధి చెందాలని కోరుతూ, సెలవు తీసుకుంటున్నాను.

1.20 మ. శ్రీ పూల రవీందర్: అధ్యక్షా, మత్స్య పరిశ్రమ అనే చర్చలో మాట్లాడేందుకు నాకు అవకాశం కల్పించినందుకు

మొదటగా మీకు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ రోజు మత్స్య పరిశ్రమ యొక్క ప్రాధాన్యత అందరికీ తెలిసినదే. గతంలో చేపల పెంపకం కేవలం రిజర్వాయర్ల మీదనే ఆధారపడి ఉండేది. కాంట్రాక్టర్ల ఆధిపత్యంలో చేపల మార్కెటింగ్ జరుగుతూ, ఎక్కువగా వెస్ట్ బెంగాల్‌కు మన చేపల ఉత్పత్తులు తరలిపోతుండేవి. ఆ విధంగా మత్స్యకార్మికులకు న్యాయం జరిగే పరిస్థితి ఉండేది కాదు.

ఈ నాడు ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెరిగింది. చేపలు ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో అందరూ గుర్తించారు. గుడ్డుతో పాటు చేపలను కూడా ఆహారంలో ఒక భాగంగా ఉండాలని డాక్టర్లు చెబుతుంటారు. గౌరవ ముఖ్యమంత్రిగారు, మత్స్యశాఖ మంత్రిగారు కూడా ఒక స్పష్టమైన ఆలోచనతో మన రాష్ట్రంలో చేపల ఉత్పత్తులను పెంచడానికి కృషిచేయడం ఎంతో అభినందనీయం అని మనవి చేస్తున్నాను. మత్స్య పరిశ్రమకు, మిషన్ కాకతీయ పథకానికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆ నాడు కాకతీయులు మరియు రెడ్డిరాజులు మన రాష్ట్రంలో బ్రహ్మాండంగా దాదాపు 46,000 చెరువులను త్వివ్వేస్తే, ఈ నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ అనే పథకం ద్వారా చెరువులకు పూడిక తీయించే ఒక గొప్ప కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన ఈ ప్రభుత్వాన్ని నేను అభినందిస్తున్నాను. చెరువుల పునరుద్ధరణ వలన అన్ని చెరువులు ఈ సంవత్సరం కురిసిన మంచి వర్షాల వల్ల, జల కళను సంతరించుకున్నాయి.

మన రాష్ట్రంలో 74 రిజర్వాయర్లు, 4,324 చిన్న తరహా మరియు పెద్ద తరహా చెరువులు, ఇవి కాకుండా కుంటలు, లేక్స్‌ను కలుపుకుంటే మొత్తం 19,746 జలాశయాలు ఉన్నాయి. ఈ సంవత్సరం మన రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేప పిల్లలను పంపిణీ చేసి, ఈ రాష్ట్రంలో ఉన్న గంగపుత్రులు, ముదిరాజ్ కుటుంబాలు మన రాష్ట్రంలో సుమారు 3,26,000 వరకు ఉంటాయి. వీరందరికీ ఉపయోగపడే విధంగా, గొప్ప ప్రణాళికను తయారుచేసి, ముందుకు తీసుకుపోతున్న సందర్భంలో, ఫిష్ సీడ్ విషయంలో మనం ప్రస్తుతం కేవలం 13 కోట్ల చేపపిల్లలను తయారు చేసుకుంటున్నాము. వాటి కొరకు ప్రభుత్వానికి సంబంధించి 28 కేంద్రాలు ఉంటే, దానిలో నాలుగు కోట్ల చేప పిల్లలను మాత్రమే మనము తయారు చేసుకోగలుగుతున్నాము. మనం self-sufficientగా ఉండే విధంగా ఈ కేంద్రాలను పెంచి, ఒక్కొక్క కేంద్రంలో ఇంకా ఎక్కువ సంఖ్యలో చేపపిల్లలను ఉత్పత్తి చేసుకునే విధంగా మన ప్రభుత్వ కేంద్రాలను బలోపేతం చెయ్యాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. ప్రైవేట్ రంగంలో ఉన్న ఏడు కేంద్రాల నుండి 9 కోట్ల చేపపిల్లలను తయారుచేసుకుంటున్నాము. మొత్తంగా చూస్తే 13 కోట్ల చేప పిల్లలు మన దగ్గర ఉత్పత్తి అవుతున్నాయి. 2016-17వ సంవత్సరంలో మనం 40 కోట్ల చేప పిల్లలను అంచనా వేసుకున్నాము. దాని వలన రూ.1,185 కోట్ల మేరకు ఆదాయం రావచ్చుని మన రాష్ట్రప్రభుత్వం అంచనా వేయడం జరిగింది.

ఈ సీడ్ విషయంలో ప్రభుత్వపరంగా, ప్రైవేటు పరంగా కలుపుకుని మొత్తం ఉత్పత్తి తెలంగాణ ప్రాంతంనుండే తయారుచేసుకునే విధంగా ఉంటే ఆ ఆదాయం కూడా ఇక్కడ ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి ఉపయోగపడుతుంది. మత్స్య రంగంలో అక్కడక్కడా ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వాళ్లు ఉన్నారు. వారందరికీ మనం చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం కొరకు ప్రభుత్వం నుండి సబ్సిడీ ఇచ్చే ఏర్పాటు చేసినట్లయితే మనం ఆంధ్రప్రదేశ్‌కో, వెస్ట్ బెంగాల్‌కో వెళ్లి, సీడ్ తెచ్చుకునే అవసరం ఉండదు.

మన దగ్గర చేపల హోల్‌సేల్ మార్కెట్ విషయం చూస్తే ఏప్రిల్, మే మరియు జూన్ నాటికి చేపలు బాగా పెరుగుతాయి. పంట బాగా వస్తుంది. ఈ సందర్భంలో మన వాళ్లు వెస్ట్ బెంగాల్‌కు వెళ్లి, మధ్య దళారుల చేతిలో పడి నష్టపోకుండా చూడాలి. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మత్స్య కార్మికుల కోసం ఒక హోల్‌సేల్ మార్కెట్‌ను ఏర్పాటుచేయవలసిందిగా మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. వారికి సముచితమైన గిట్టుబాటు ధరను ఏర్పాటు చేసినట్లయితే వారిని మధ్య దళారుల నుండి కాపాడినవారమవుతాము. ఈ పద్ధతిలో ముందుకు వెళ్లవలసిన అవసరముంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వారికి అనేక రకాలుగా సహకారమందిస్తున్నది. వంద రిటైల్ మార్కెట్లను త్వరలో ప్రభుత్వం ఏర్పాటుచేయబోవడం సంతోషకరం. ఈ నాడు ఎక్కువగా చేపల అమ్మకాలు రోడ్లమీదనే జరుగుతున్నాయి. హైదరాబాద్ నగరంతో పాటు, జిల్లాల్లో, పట్టణాల్లో వీటికి ప్రత్యేకమైన మార్కెట్‌ను ఏర్పాటు చేసి, మత్స్యకారులకు సహకారం అందిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నాను.

అదే విధంగా ఒక్కొక్క కమ్యూనిటీ హాల్‌కు రూ.10లక్షల వ్యయంతో , 400 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఈ ప్రభుత్వం పూనుకున్నది. 2013-14లో మత్స్యశాఖ యొక్క బడ్జెట్ రూ.75 లక్షలు కాగా, 2016-17వ సంవత్సరంలో దానిని టిఆర్ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్లకు పెంచింది. రూ.40 కోట్ల ఖర్చుతో రూ.485 కోట్ల విలువ చేసే చేపపిల్లల ఉత్పత్తి చేయాలని రాష్ట్రప్రభుత్వ సంకల్పించి, ఒక చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నది. ఈ రోజున డాక్టర్లు చికెన్,

మటన్ తినకపోయినా పరవాలేదు, గుడ్డు, చేపలు తినాలని ప్రజలకు సూచిస్తున్నారు. మన తెలంగాణలో కేవలం white fish మాత్రమే ఉత్పత్తి చేస్తున్నాము. చాలామంది తెలంగాణ ప్రజలు ఈ తెల్లచేపలను తినడానికి ఇష్టపడరు. కొర్రమీను చేపలకు కూడా ప్రభుత్వం సీడ్ తయారుచేయాలి. అదే విధంగా చందమామ చేపలు మరియు బురద మట్ట చేపలను మాత్రమే ఇక్కడి ప్రజలు ఇష్టపడతారు. తెల్లచేపలు ఎక్స్‌పోర్టు కొరకే ఉపయోగపడుతున్నాయి. ఆ తెల్లచేపలతో పాటు వీటిని కూడా పెంచినట్లయితే, మన ప్రజల ఆరోగ్యాన్ని మనం బాగుపరచుకున్నవాళ్లమవుతాము. మత్స్యకార్మికులను అభివృద్ధిపథంలోకి తీసుకురావడానికి మన గౌరవ ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు, తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తున్నందుకు వారికి నా ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ, చివరగా పాఠశాలల్లో పిల్లలకు గుడ్డుని ఆహారంతోపాటు ఇస్తున్నాము. అవకాశముంటే వారికి చేపలను కూడా ఏర్పాటుచేస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

శ్రీ డి. రాజేశ్వర రావు అధ్యక్షా, మత్స్యపరిశ్రమ అనే అంశం పై నాకు మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు మీకు నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ రోజు మన ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్‌గారు మత్స్య పరిశ్రమ అభివృద్ధి కొరకు ఎన్నో పథకాలు రూపొందించి, ముందుకు వెళుతున్న సందర్భంలో వారికి నా అభినందనలు తెలియజేస్తున్నాను. కేవలం ఫిషర్‌మెన్లే కాదు, మత్స్య పరిశ్రమ ఆధారంగా ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. ఇందులో ఎస్సీలు, ఎస్టీలు కూడా ఉన్నారు. ముఖ్యమంత్రిగారు ఒక సందర్భంలో మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో 20 శాతం ఫార్వర్డ్ కులాలవారుంటే, 80 శాతం వెనుకబడిన వాళ్లున్నారు. చాలామంది బీద స్థితిలో ఉన్నారు. వారి ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది కాబట్టి, ఈ కమ్యూనిటీని డెవలప్ చెయ్యాలి, బెస్తవారిని ఆర్థికంగా ముందుకు తీసుకుపోవాలి, వారి జీవనప్రమాణాలను పెంచాలని మన ముఖ్యమంత్రిగారు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారు. చేప పిల్లలు పెరిగి, వాటి ఉత్పత్తి పెరిగి, మనకు ఎక్కువ ఆదాయం సమకూరాలంటే అందుకు చెరువుల్లో నీళ్లు బాగా ఉండాలి. అందులో భాగంగా మిషన్ కాకతీయ పథకాన్ని మొదలుపెట్టారు. చెరువులు నిండి ఉంటే, చేపలు బాగా పెరుగుతాయి. చేపలు వృద్ధి చెందితే గంగపుత్రుల జీవితాలు కూడా మెరుగుపడతాయి. ఆంధ్రా ప్రజలు కూడా మన తెలంగాణ ఫిష్‌ను ఇష్టపడతారు. వెస్ట్‌బెంగాల్ వాళ్లు చేపలను బాగా ఇష్టపడి తింటారు. ఇది వెజిటేరియన్ ఫుడ్‌గా భావిస్తారు. డాక్టర్లు కూడా చేపలు ఎక్కువగా తినాలని చెబుతున్నారు.

ఈ రోజు మన ప్రభుత్వం కూరగాయల సాగుకొరకు 90 శాతం వరకు సబ్సిడీ ఇస్తు న్నది. అదే విధంగా ఫిష్‌సీడ్ ఉత్పత్తి ఎక్కువగా జరిగి, భారతదేశంలో మన రాష్ట్రం నెంబర్-1 రాష్ట్రంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను.

చేపల ఉత్పత్తిలో దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. రెండవ స్థానం వెస్ట్ బెంగాల్‌ది, మన తెలంగాణ ఎనిమిదవ స్థానంలో ఉంది. కాబట్టి మన రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టాలి. ఈ రోజున మనం పక్క రాష్ట్రం నుండి 24 కోట్ల ఫిష్ సీడ్‌ను తీసుకువస్తున్నాము. రూ.22.50 కోట్లు ఇందుకోసం మనం ఖర్చు చేస్తున్నాము. కాబట్టి ఆ సీడ్ మనమే ఇక్కడ ఉత్పత్తి చేసుకుంటే, మన వాళ్లకు ఉపాధి దొరికినట్లవుతుంది. నిజాంసాగర్‌లో 50 లక్షల తొట్లు already construction అయి, ఉన్నాయి. ఒకపన్నెండు లక్షల రూపాయల ఖర్చుతో కొద్దిపాటి రిపేర్లు చేసి, నీళ్లు నింపినట్లయితే మనము 50 లక్షల చేపపిల్లలను ఉత్పత్తి చేసుకోగలుగుతాము. అదే విధంగా కరీంనగర్, వరంగల్, కడెం, పోచంపాడు, నిజామాబాద్ వంటి ప్రాంతాలలో, కొన్ని మైనర్ రిపేర్లు చేసుకోగలిగితే మనం మొత్తం కోటి యాభై లక్షల సీడ్‌ను ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. మన రాష్ట్రంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు.

నేను మీ ద్వారా మంత్రిగారిని కోరేది ఏమిటంటే వచ్చే సంవత్సరంలో 40 కోట్ల సీడ్‌ను ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో ఉన్నారు కాబట్టి, ఇప్పటినుండే ప్రతి జిల్లాలో ఈ సీడ్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకోగలిగితే బాగుంటుంది. మనకు కృష్ణా, గోదావరి నదులున్నాయి. మంజీరా, మూసీ నదులున్నాయి. అన్ని జిల్లాలకు నీటి వసతి ఉండడం వలన మనకు సీడ్ ఉత్పత్తి చేసుకునే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. మన కృష్ణనీళ్లు తాగినా, గోదావరి నీళ్లు తాగినా రోగాలే రావంటారు. కాబట్టి ఈ నీళ్లతో మనం సీడ్ ఉత్పత్తి చేసుకోగలిగితే రాబోయే రోజుల్లో మనకు మంచి మార్కెట్ ఉంటుంది. మనం ఆర్థికంగా మరింత బలపడతాం. ఫిషర్‌మెన్లకు మనం వలలుగాని, పనిముట్లుగాని, మార్కెటింగ్ చేసుకోవడానికి వెహికిల్స్‌గాని ఏర్పాటు చేయవలసి ఉంది. మనకు సిటీలో ముషీరాబాద్‌లో మంచి ఫిష్ మార్కెట్ ఉంది. కూరగాయల విషయంలో ఏ విధంగా నైతే మంచి మార్కెట్లను ఏర్పాటు చేశారో, అలాగే మంచి వాతావరణంలో ఫిష్‌మార్కెట్లను ఏర్పాటు చేయలని మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. చేపలు తింటే అన్ని విటమిన్లు శరీరానికి అందుతాయి కాబట్టి, తెలంగాణలో చేపల ఉత్పత్తి

మరింత జరగవలసిన అవసరం ఉంది. అలాగే చేపల పెంపకం కేజ్ కల్చర్ క్రింద గాని, Blue Revolution పథకం క్రిందగాని చేపడితే బాగుంటుందని అనుకుంటున్నాను. కేంద్ర ప్రభుత్వం నుండి రూ.14 కోట్లు Blue Revoution పథకం ద్వారా మనకు రావడం జరిగింది. రాష్ట్రప్రభుత్వ కంట్రిబ్యూషన్ ద్వారా ఫిషర్‌మెన్లకు మరింత చేయూతను కల్పించవలసిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి, మరింత ఆర్థిక సహాయం పొందగలిగితే మన యువకులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందని మనవి చేస్తున్నాను. చేపల పెంపకానికి ప్రత్యేకంగా చెరువులు కూడా అవసరం లేదు. తొట్లని ఉపయోగించడం ద్వారా కూడా వాటిని ఉత్పత్తి చేయవచ్చును. ఒక పావు ఎకరం స్థలం ఉంటే, ఫిష్ ఫార్మ్ ఏర్పాటుచేసుకుని, దానిని డెవలప్‌చేసుకోవచ్చు. అందుకొరకు మనకు కేంద్రం నుండి సబ్సిడీ కూడా అందుతుంది. కొంతవరకు నిరుద్యోగ సమస్య కూడా పరిష్కారం అవుతుంది. ముఖ్యమంత్రిగారి ఆశ మేరకు, వారి కోరిక మేరకు చేపల ఉత్పత్తిలో మన రాష్ట్రం అగ్రగామిగా, ఎక్స్‌పోర్ట్ చేసే రాష్ట్రంగా దీనిని తీర్చిదిద్దాలని, ఈ రంగం పై ఆధారపడి జీవిస్తున్న వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరుతూ, నాకు ఈ అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, సెలవు తీసుకుంటున్నాను.

**1.40 మ.** శ్రీమతి ఆకుల లలిత: అధ్యక్షా, మా నిజామాబాదు జిల్లాలో చేపల అభివృద్ధి క్రింద 336 చెరువులు, కుంటలు, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో ఈ సంవత్సరం 2.12కోట్ల చేప పిల్లలను వేయడం జరిగింది. దీనికి రూ.1.90కోట్లు కూడా ఖర్చు చేయడం జరిగింది. ఆవిధంగా కార్యక్రమం చేపట్టినందుకు మా కాంగ్రెస్ పార్టీ తరఫున గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం, హర్షిస్తున్నాం. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన మా జిల్లాకు వచ్చినపుడు రెవ్యూ మీటింగు పెట్టారు. చేపలు పాడవకుండా ప్రతి జిల్లా మార్కెట్లలో ఎయిర్ కండిషన్, ఐస్ బాక్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏదైనా జిల్లాలో పెట్టారో లేదో తెలియదు కానీ మా నిజామాబాదు జిల్లాలో మాత్రం ఏర్పాటు చేయలేదు. మత్స్య సంఘాలున్న గ్రామాలలో గంగపుత్రులకు ఈ చేపల మీద హక్కు ఉంటుంది, మరి గంగపుత్రులు లేని గ్రామాలలో ముదిరాజులు చేపలను పట్టుకోవచ్చా? ఈ విషయంపై కొన్ని చోట్ల గొడవలు జరుగుతున్నాయి. గంగపుత్రులున్న చోట ముదిరాజులని, ముదిరాజులున్న చోట గంగపుత్రులని అంటున్నారు. ఈ విషయంపై క్లారిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నాను.

దళారీల ద్వారా బోగస్ సొసైటీలు ఏర్పాటు చేస్తున్నారు. అది జరగకుండా చూడాలని కోరుతున్నాను. గంగపుత్రులకు, ముదిరాజులకు మంచి ఉపాధి కల్పించే పథకం. దీని మూలంగా గ్రామీణ ప్రాంతాలలో మత్స్యకారులకు మంచి ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే వాళ్ల జీవన ప్రమాణాలు మెరుగుపుతాయి. మా డెప్యూటీ యల్‌పి గారు చెప్పినట్లు చేపలు ఆరోగ్యానికి చాలా మంచివి. చేపలు ఎక్కువగా తింటే కేన్సర్, గుండెపోటు తదితర బీమారీలన్నీ తగ్గిపోతాయి. చేపల మార్కెట్లలో మంచి సౌకర్యాలు కల్పించాలి. వేసవి మరియు వర్షాకాలంలో మార్కెట్లో ఉన్న చేపల మీద ఎక్కువగా ఈగలు వాలుతుంటాయి. ఆవిధంగా జరగకుండా చేపల మార్కెట్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఎక్కువ చెప్పి చేయకపోతే బాగుండదు. అన్నీ చేస్తామని అంటున్నారు కానీ ఏమీ చేయడం లేదు. తప్పకుండా ఈ విషయాల మీద చొరవ తీసుకోవాలని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: ఈ చర్చకి ప్రభుత్వం వైపు నుంచి సంబంధిత మంత్రిగారి సమాధానం మంగళవారం ఉంటుంది. మంగళవారం, జనవరి 03, 2017, ఉదయం 10.00 గంటల వరకు సభను వాయిదా వేయడమైంది.

(The House then adjourned at 1.44p.m. to meet again at 10.00 a.m. on Tuesday, 3rd January, 2017)

☺☺☺

“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”